# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :191 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: ఆదివారం 29-09-2024 | పేజీలు:4 వెల: 2.00


## అమెరికాలో హెలెనా విధ్వంసం..

ఆగ్నేయ అమెరికాలో హరికేన్ హెలెనా విధ్వంసం సృష్టిస్తోంది. ఫ్లోరిడా, జార్జియా, నార్త్ కరోలినా, సౌత్ కరోలినా, వర్జీనియా రాష్ట్రాల్లో ఈ తుపాను ప్రభావం అధికంగా ఉంది. ముఖ్యంగా ఫ్లోరిడా రాష్ట్రంపై ఈ తుపాను అత్యధికంగా ప్రభావం చూపినట్లు అధికారులు తెలిపారు. దాదాపు పది కౌంటీల్లో ఈ తుపాను తీవ్రత ఉన్నట్లు వెల్లడించారు. తుపాను ధా టికి ఆయా రాష్ట్రాలను వరద చుట్టుముట్టింది. అతి తీవ్రమైన హెలెనా కారణంగా పదుల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. హెలెనా తుపాను కారణంగా దాదాపు 44 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. మృతుల్లో ముగ్గురు అగ్నిమాపక సిబ్బంది, ఒక మహిళ, నెల వయసున్న చిన్నారి సైతం ఉన్నట్లు తెలిపారు. అనేక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో.. ప్రజలు అంధకారంలోకి వెళ్లిపోయారు. పలు ఆసుపత్రుల్లో కూడా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇక యునికోయ్ కౌంటీ ఆసుపత్రిని వరదలు ముంచెత్తడంతో రంగంలోకి దిగిన అధికారులు హెలికాప్టర్ సాయంతో 54 మందిని రక్షించారు.

## అఖిలపక్షంతో సంప్రదించాకే మూసీపై ముందుకెళ్లాలి



హైదరాబాద్: మూసీలో గోదావరి నీళ్లు పారిస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి.. పేద, మధ్య తరగతి ప్రజల కన్నీళ్లు పారిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ప్రభుత్వానికి పేదల ఆశీర్వాదాలు ఉండాలని, వారి గోసలు కాదని చెప్పారు. పేదల కన్నీళ్లపై అభివృద్ధి చేయడం ఏంటని ప్రశ్నించారు. మీ సోదరుడికి నోటీసులు ఇచ్చి, పేదల ఇంటికి బుల్డోజర్లు పంపుతారా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ లీగల్ సెల్ ప్రతినిధులు, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో హైడ్రా బాధితులతో హరీశ్ రావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేదల ఇండ్లు కూల్చి మూసీపై పెద్ద భవనాలకు అనుమతి ఇస్తామంటున్నారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం బాధితుల వద్దకు వస్తుందన్నారు.కేసీఆర్ పాలనలో ప్రజలను ఇబ్బంది పెట్టలేదని చెప్పారు. సీఎం రేవంత్ అనాలోచిత నిర్ణయాలతో పాలన చేస్తున్నారని విమర్శించారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్న అంశంపై దృష్టి సారించాలని హితవు పలికారు. ప్రజలు రోగాలబారిన పడుతున్నప్పుడు వాటిపై దృష్టి పెట్టే ఆలోచన ముఖ్యమంత్రి చేయలేదని విమర్శించారు. హైదరాబాద్ ఖ్యాతిని సీఎం రేవంత్ దెబ్బ తీస్తున్నారని చెప్పారు. అఖిలపక్ష సమావేశం నిర్వహించిన తర్వాతే మూసీపై ముందుకు వెళ్లాలని డిమాండ్ చేశారు.కూకటపల్లిలో హైడ్రా బాధితురాలు బుచ్చమ్మది ఆత్మహత్య కాదని, అది రేవంత్ రెడ్డి చేసిన హత్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముగ్గురు బిడ్డలకు ఇల్లు కట్టించి పెండ్లిళ్లు చేసిందని, ఆ ఇల్లు కూలగొడితే తన బిడ్డల భవిష్యత్తు ఏం అవుతుందని బాధతో ఆత్మహత్య చేసుకుందని వాపోయారు. మొన్న కూడా ఒక ఆమె ఇల్లు కూలకొట్టే సరికి గుండె పోటుతో చనిపోయిందన్నారు. ఇవన్నీ రేవంత్ రెడ్డి పిచ్చి నిర్ణయాల వల్లే జరుగుతున్నాయన్నారు. రాహుల్ గాంధీ హర్యానా ఎన్నికల ప్రచారంలో బుల్డోజర్ రాజ్ నహీ చలేగా అంటూ ప్రచారం చేస్తున్నాడని, మరి తెలంగాణలో ఏం జరుగుతున్నదని ప్రశ్నించారు. నేడు తెలంగాణలో కూడా బుల్డోజర్ రాజ్యం నడుస్తుందన్నారు. ముందు తెలంగాణకు వచ్చి బుల్డోజర్లు ఆపి ఆ తరువాత బుల్డోజర్ రాజ్ నహీ చలేగా అంటూ ఇక్కడ ప్రచారం చేయాలన్నారు. హైడ్రా బాధితులంతా తమ కుటుంబ సభ్యులని, మీకోసం తెలంగాణ భవన్ తలుపులు ఎప్పుడు తెరిచే వుంటాయన్నారు. ఎప్పుడైనా రావచ్చని, తాము మీ వెంటే ఉంటామని భరోసానిచ్చారు. బాధితులకు రక్షణ కవచంలా ఉంటామని చెప్పారు. లీగల్ సెల్ బాధితులకు అండగా ఉంటుందని చెప్పారు.


## తెలంగాణ భవన్‌కు హైడ్రా బాధిత కుటుంబాలు



హైదరాబాద్: హైడ్రా బాధితులు తెలంగాణ భవన్‌కు చేరుకుంటున్నారు. కేటీఆర్‌ను కలిసి తమ గోడు ఏళ్ళబోసుకుంటామని చెబుతున్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పేరుతో ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే నిర్మాణాలను హైడ్రా కూల్చివేస్తున్నది. దీనికితోడు ఆపరేషన్ మూసీ పేరుతో మూసీ నది పరివాహక ప్రాంతాల్లో అధికారులు మార్కింగ్ చేస్తుండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు బిక్కుబిక్కుమంటూ ఉంటున్నారు. ఈ నేపథ్యంలో బాధితులకు అండగా ఉంటామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. దీంతో శనివారం ఉదయం హైడ్రా బాధితులు ఒక్కొక్కరిగా తెలంగాణ భవన్‌కు చేరుకుంటున్నారు.కంటి మీద కునుకు ఉండట్లేదని, ఎవరికి చెప్పుకోవాలో తమకు అర్థం కావట్లేదని బాధితు కన్నీటి పర్యంతమవుతున్నారు. పైసా పైసా కూడబెట్టి ఇండ్లు కట్టుకున్నామని ఓ మహిళ తెలిపింది. తమ ఇల్లు కూలిపోతే తట్టుకునే శక్తి తమకు లేదని, గుండె ఆపోతుందని వాపోయింది. గొంతులోకి అన్నం దిగట్లేదని, టీవీ చూస్తే భయం అయితుందని చెప్పారు. రాజకీయ నాయకులే మోసం చేస్తే తమ బాధ ఎవరికి చెప్పుకోవాలని రోధించారు.తమకు మద్దతుగా ఉండాలని మెయిన్ స్ట్రీమ్ మీడియాకు ఓ బాధితుడు విజ్ఞప్తి చేశారు. అక్రమ కట్టడాలు అని పదే పదే ఎందుకు చెప్తు న్నారని, అమ్ముడు పోయారా అని ప్రశ్నించారు. మీ రేటింగ్స్ కోసం తప్పుడు ప్రచారం చేయవద్దని, నిజం నిర్భయంగా చెప్పాలని కోరారు. ప్రభుత్వ మే అన్ని అనుమతులు ఇచ్చి, కరెంట్ బిల్లు ఇచ్చి.. టాక్స్ కట్టించుకుంటూ, ఎస్‌బీఐ లాంటి పెద్ద పెద్ద బ్యాంకులు లోన్లు ఇచ్చిన ఇండ్లు అక్రమం అని కూ లగొడ్తే తమ బాధ ఎవరికి చెప్పుకోవాలని వాపోయారు. తనకు కళ్లు కనిపించ్వని, తమ బాధ చెప్పుకుందాం అని తెలంగాణ భవన్‌కు వచ్చానన్నా రు. కాగా, కేటీఆర్ జ్వరంతో బాధపడుతున్నారని, బాధితులను కలవడానికి హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి వస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## తిరుపతి లడ్డూ వివాదంపై సుప్రీం కోర్టులో పిటీషన్లు.. సెప్టెంబర్ 30న విచారణ

తిరుమల: తిరుమల దేవాలయం లడ్డూలో జంతువుల కొవ్వు పదార్థాలు ఉన్నట్లు ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలు చేయడంతో దేశవ్యాప్తంగా ఈ అంశం వివాదాస్పదంగా మారింది. దీనిపై విచారణ జరిపించాలని సుప్రీం కోర్టులో దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు (పిల్) సెప్టెంబర్ 30న విచారణకు రానున్నాయి. బిజేపీ సీనియర్ లీడర్ సుబ్రమణియన్ స్వామి, తిరుమల తిరపతి దేవస్థానం (టిటిడి) మాజీ అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి ఈ పిటీషన్లు దాఖలు చేశారు.తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి ఆరోపణలపై ఒక స్వతంత్ర విచారణ కమిటీ చేత విచారించాలని సుబ్రమణియన్ స్వామి తన పిటీషన్‌లో పేర్కొనగా.. ఆ కమిటీకి ఒక మాజీ సుప్రీం కోర్టు న్యాయమూర్తి అధ్యక్షుడిగా వ్యవహరించాలని మాజీ టిటిడి అధ్యక్షుడు, వైసీపీ నాయకుడు వైవి సుబ్బారెడ్డి తన పిటీషన్‌లో డిమాండ్ చేశారు. ఈ రెండు పిటీషన్ల విచారణ సుప్రీం కోర్టు ద్విసభ్య ధర్మాసనం చేపట్టనుంది. జస్టిస్ బిఆర్ గవై, కెవి విశ్వనాథన్ ఈ ధర్మసనంలో ఉంటారు.తిరుమల లడ్డూ వివాదంపై ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం పూర్తి వివరాలతో ఒక నివేదిక సమర్పించాలని బిజేపీ సీనియర్ నేత సుబ్రమణియన్ స్వామి తన పిటీషన్ లో కోరారు. దేవాలయంలో లడ్డూ నాణ్యత చెకింగ్, లడ్డూ తయారీ ప్రక్రియ అందులో పదార్థాలు, వాటి సప్లయర్ల వివరాలు అన్నీ నివేదికలో పొందుపర్చాలని సుబ్రమణియన్ స్వామి అన్నారు.తిరుమల లడ్డూ వివాదంపై ఇప్పటికే ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం 9 మంది సభ్యులు గల స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) ఏర్పాటు చేసి లడ్డూలో కల్తీ నెయ్యి, జంతువుల కొవ్వు అంశంపై విచారణకు ఆదేశించింది. సెప్టెంబర్ 22న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తిరుమల లడ్డూ వివాదంపై సిట్ విచారణకు ఆదేశిస్తున్నట్లు తెలిపారు.అయితే తిరుమల లడ్డూ తయారీలో




గత కొన్ని సంవత్సరాలుగా కర్ణాటకకు చెందిన నందిని నెయ్యి ఉపయోగించేవారు. కానీ వైసీపీ పాలనలో ఆ కాంట్రాక్టు రద్దు చేసి తమిళనాడుకు చెందిన ఏఆర్ డైరీ నుంచి నెయ్యి కొనుగోలు చేయడం ప్రారంభించారు. నందిని నెయ్యి కంటే ఏఆర్ డైరీ చాలా తక్కువ ధరకే నెయ్యిని సరఫరా చేసేందుకు అంగీకరించడంతోనే ఈ మార్పులు చేసినట్లు అప్పటి టిటిడి కమిటీ తెలిపింది. కానీ ఏఆర్ డైరీ పంపిణీ చేసే నెయ్యిలో నాణ్యత లేదని ఫలితంగా దాంతో తయారైన లడ్డూలో నాణ్యత లోపించిందని చాలా మంది భక్తులు గత కొన్ని నెలలుగా ఫిర్యాదులు చేశారు.దీంతో జూలై 2024లో లడ్డూ నాణ్యతపై గుజరాత్ కు చెందిన ఒక జాతీయ డైరీ లేబరేటరీ పరీక్షలు చేసింది. ఈ పరీక్షల్లో లడ్డూలో ఉపయోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వు ఉన్నట్లు తేలింది. లడ్డూ తయరీకి ఉపయోగించే నెయ్యిలో చేప నూనె, బీఫ్ కొవ్వు, పంది కొవ్వు అవశేషాలు ఉన్నట్లు గుజరాత్ జాతీయ డైరీ లెబరేటరీ తన రిపోర్ట్ లో తెలిపింది.

## ముంబైకి ఉగ్రముప్పు హెచ్చరికలు.. పోలీసులు హై అలర్ట్



ముంబై :దేశ ఆర్థిక రాజధాని ముంబై లో భయాందోళన పరిస్థితులు నెలకొన్నాయి. ముంబై మహానగరానికి ఉగ్ర ముప్పు పొంచి ఉన్నట్టు కేంద్ర నిఘా వర్గాలు హెచ్చరించాయి. దీంతో అప్రమత్తమైన నగర పోలీసులు ముంబై వ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేశారు. ఎక్కడికక్కడ తనిఖీలు చేపట్టారు. రద్దీ ప్రాంతాలతోపాటు మతపరమైన ప్రాంతాల్లో సైతం పోలీసులు భారీగా మోహరించారు.ఆయా ప్రాంతాల్లో మాక్ డ్రిల్స్ సైతం నిర్వహించాలని ఆదేశించినట్లు నగర పోలీస్ ఉన్నతాధికారి ఒకరు శనివారం వెల్లడించారు. నగరంలోని డీసీపీలు (డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్) కూడా తమ తమ జోన్లలో భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే ముందు జాగ్రత్త చర్యగా వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలని సూచించారు.అయితే, పండుగల సీజన్ నేపథ్యంలో నగరంలో భద్రతను కట్టుదిట్టం చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 10 రోజులపాటు గణేశ్ నవరాత్రి ఉత్సవాలు జరుపుకున్న ముంబై వాసులు ఇప్పుడు దుర్గాపూజ, దసరా, దీపావళి పండగలు సిద్ధమవుతున్నట్లు గుర్తు చేశారు. అంతేకాకుండా నవంబర్‌లో మహారాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరిగే అవకాశ ఉన్నందున నగరంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యగా భద్రతను కట్టుదిట్టం చేసినట్లు పోలీసు ఉన్నతాధికారి వెల్లడించారు.

## నా లొకేషన్ ఎలా వచ్చింది.. అదంతా అబద్ధం..

విజయవాడ:ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణ రాజు అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టారన్న కేసులో తన మీద వచ్చిన ఆరోపణలపై సీఐడీ మాజీ చీఫ్ సునీల్‌కుమార్ స్పందించారు. రఘురామకృష్ణరాజును అరెస్టు చేసిన రోజు తాను సీఐడీ గుంటూరు రీజినల్ ఆఫీసుకు వచ్చినట్లుగా ఎవరూ వాంగ్మూలం ఇవ్వలేదని తెలిపారు.తన సమక్షంలోనే రఘురామకృష్ణను చిత్రహింసలకు గురిచేశారని అప్పటి సీఐడీ సిబ్బంది వాంగ్మూలం ఇచ్చారన్న వార్తలను ఆయన ఖండించారు. అదంతా అబద్ధమని పేర్కొన్నారు. ఆరు నెలలకు మించి కాల్ డేటా ఉండదు.. అదే విషయాన్ని టెలికం సంస్థలు కూడా చెప్పాయని.. అలాంటిది తన లొకేషన్ ఎలా వచ్చిందని ప్రశ్నించారు.సీఐడీ అరెస్టు తర్వాత రఘురామకృష్ణ రాజుకు ఎలాంటి గాయాల్లేవని ఇచ్చిన సర్టిఫికెట్‌కు గుంటూరు వైద్యులు కట్టుబడి ఉన్నారని స్పష్టం చేశారు. వాళ్లెవరూ వేరే విధంగా వాంగ్మూలం ఇవ్వలేదని.. ఇవ్వరు కూడా అని మాజీ డీజీ సునీల్‌కుమార్ తెలిపారు. తప్పుడు సర్టిఫికెట్ ఇచ్చామని చెబితే.. వారి డాక్టర్ సర్టిఫికెట్ రద్దవుతుందని పేర్కొన్నారు. రఘురామకృష్ణ రాజు ఒంటిపై గాయాలు ఉన్నాయని.. కొట్టడం వల్లే అవి అయ్యాయని మిలటరీ ఆస్పత్రి వైద్యులు కూడా చెప్పలేదని అన్నారు. మిలటరీ డాక్టర్లు సివిల్ కోర్టులకు రారని.. సాక్ష్యం చెప్పరని తెలిపారు. అది ఆర్మీ యాక్ట్ వారికి కల్పించిన రక్షణ అని వివరించారు.కాగా, సీఐడీ కస్టడీలో ఉన్న సమయంలో రఘురామ రాజును చిత్రహింసలు పెట్టింది నిజమేనని అప్పటి సీఐ, ఎస్సై, ఇతర సిబ్బంది పోలీసులకు



వాంగ్మూలం ఇచ్చారని నిన్న ఓ వార్త బయటకొచ్చింది. ఆ కథనం ప్రకారం.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రఘురామను కొడుతూ నాటి సీఐడీ చీఫ్ సునీల్‌కుమార్‌కు చూపించామని వాళ్లు వాంగ్మూలంలో చెప్పారు. అయితే కొట్టడమంటే అలా కాదంటూ కాల్ కట్ చేసి ముసుగేసుకున్న నలుగురితో కలిసి చీఫ్ లోపలికి వచ్చి కొట్టించారని పేర్కొన్నారు. రఘురామ రాజుపై థర్డ్ ప్రయోగించారని చెప్పారు. సునీల్‌కుమార్ సమక్షంలోనే ఇదంతా జరిగిందని నిరూపించేందుకు గూగుల్ టేక్‌అవుట్ ద్వారా ఆయన సెల్‌ఫోన్ లొకేషన్‌ను కూడా తీసుకున్నారని నిన్న వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే సీఐడీ మాజీ బాస్ స్పందించారు.

## బాధితులకు అండగా నిలిచిన మాజీ మంత్రి తలసాని



హైదరాబాద్ : ఎవరికి ఏ కష్టమొచ్చినా నేనున్నాను అంటూ అండగా నిలిచే మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మరోసారి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. మోండా మార్కెట్‌లో షాపులు కూలి నష్టపోయిన 6 టైలరింగ్ కుటుంబాలను తలసాని ఆదుకున్నారు. శనివారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన వ్యక్తిగ తంగా రూ. 20 వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేసి అండగా నిలిచారు.ఈ నెల 24 వ తేదీన మోండా మార్కెట్‌లోని ఓల్డ్ జైలు ఖానా గోడ కూలి పక్కనే ఉన్న టైలర్ షాపులపై పడడంతో 6 షాపులు కూలిపోవడం, అందులోని కుట్టు మిషన్లు, దుస్తులు, ఇతర సామాగ్రి దెబ్బతిని తీవ్రంగా నష్టపోయాయి. విషయం తెలుసుకున్న వెంటనే అదేరోజు తలసాని శ్రీనివాస్ యాదవ్ సంఘటనాస్థలికి చేరుకొని బాధితులను పరామర్శించారు. బాధితులకు అండగా ఉంటానని, ఆర్థిక సహాయాన్ని అందజేస్తానని హామీ ఇచ్చారు. హామీ ఇచ్చిన మేరకు శనివారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన కార్యాలయానికి బాధిత కుటుంబాలను ఆహ్వానించి ఆర్థిక సహాయం అందించారు.ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. 70 సంవత్సరాల నుండి టైలరింగ్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, అనుకోని సంఘటనతో తీవ్రంగా నష్టపోయానని అన్నారు. ఈ ఘటనలో షాపులలోని కుట్టు మిషన్‌లు, ఇతర సామాగ్రి కాకుండా రానున్న, దసరా, దీపావళి పండుగల సందర్భంగా స్టిచ్చింగ్ కోసం కస్టమర్లు ఇచ్చిన దుస్తులు కూడా మట్టి శిథిలాలలో కలిసిపోయాయని తెలిపారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని. సంఘటన జరిగిన రోజునే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళడంతో అధికారులు ప్రమాదస్థలికి చేరుకొని పంచనామా జరిగింది. బాధితులను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు లేఖ కూడా రాశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు తలసాని స్కై లాబ్, నాగులు, రాములు, మహేందర్, మహేష్, జయరాజ్, మేరు సంఘం నాయకులు శ్రీనివాస్, వెంకటేష్, కృష్ణ యాదవ్ ఉన్నారు.

### జగన్ తిరుమలకు అందుకే వెళ్లలేదు..

వెంకన్నపై విశ్వాసం లేకనే జగన్ తిరుమలకు వెళ్లలేదని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. పర్యటన రద్దు చేసి విమర్శలు చేయడం సిగ్గుచేటు అని గుర్తు. జగన్ తీరుతో హిందూ సంఘాలు ఆందోళనలో ఉన్నాయని అన్నారు. డిక్లరేషన్‌పై సంతకం పెట్టడానికి జగన్‌కు ఇబ్బంది అని ప్రశ్నించారు. గతంలో అబ్దుల్ కలాం, సోనియా గాంధీ కూడా డిక్లరేషన్‌పై సంతకం పెట్టారని గుర్తుచేశారు. తాము ఎవరికీ నోటీసులు ఇవ్వలేదని స్పష్టం చేశారు.హింసా రాజకీయాలపై మాట్లాడే హక్కు పేర్ని నానికి లేదని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. గతంలో టీడీపీ, జనసేన నాయకుల ఇళ్లపై దాడికి దిగారని అన్నారు. తనపై హత్యాచారం కేసు మోపి 54 రోజులు జైల్లో పెట్టారని గుర్తుచేశారు. బందరు పోర్టు, మెడికల్ కాలేజీలను ఎవరికి బేరం పెట్టారని పేర్ని నాని కొల్లు రవీంద్ర ప్రశ్నించారు. ఇళ్ల స్థలాల పేరుతో భూములు కబ్జా పేదలుగా గుర్తింపు పొందింది. పేర్ని నాని అవినీతిపై విచారణ జరుగుతోందని తెలిపారు. త్వరలోనే అన్ని వివరాలను బయటపెడతామని చెప్పారు.

## అప్పుడు నీ మానవత్వం ఎక్కడికి పోయింది..



అమరావతి,నా మతం మానవత్వం.. డిక్లరేషన్‌లో రాసుకుంటారేమో రాసుకోండి అని మాజీ సీఎం వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలపై ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణ రాజు ఘాటుగా స్పందించారు. తనను చిత్రహింసలకు గురిచేసి నప్పుడు ఆయన మతం,మానవత్వం ఎక్కడ పోయిందని ప్రశ్నిస్తారు. శ్రీవారిపై నమ్మకం ఉందని డిక్లరేషన్ ఇచ్చి పూజిస్తే.. క్రైస్తవుల ఓట్లు తనకు దూరమవుతా యని జగన్ ఆందోళన చెందుతున్నారేమో అని ఎద్దేవా చేశారు.కంచె చేను మేసిందన్న చందంగా టీటీడీ చైర్మన్ హెూదాలో హిందూ ధర్మాన్ని పరిరక్షించాల్సిన వ్యక్తులే ఆచార సంప్రదాయాలను మంటగలిపారని రఘురామకృష్ణ రాజు. గతంలో అబ్దుల్ కలాం, సోనియాగాంధీ వంటి వారు స్వామి వారిని దర్శించుకునే ముందు డిక్లరేషన్ ఇచ్చారని గుర్తుచేశారు. గతంలో జగన్ తిరుమలకు వచ్చినప్పుడు డిక్లరేషన్ అడిగితే అధికారులను చీదరించుకొని, చెప్పులు వేసుకునే మాడవీధుల్లో తిరిగారని చెప్పారు.జగన్‌తో పాటు తిరుమలకు అల్లరి మూకలు చేరి చిల్లరగా వ్యవహరించే బాధ్యత ఎవరిది అని ప్రశ్నించారు. ఆ భయంతోనే పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారని వివరించారు.తనను చిత్రహింసలకు గురిచేసిన సీఐడీ మాజీ చీఫ్ సునీల్‌కుమార్‌ను తక్షణమే అరెస్టు చేశారు రఘురామకృష్ణరాజు డిమాండ్ చేశారు. తనను భయపెట్టాలని చూడవద్దని అన్నారు. తనకు లేనిదే భయమని స్పష్టం చేశారు.

## సంపాదకీయం

ఆదివారం 29-09-2024

# పర్యాటకం.. దేశాభివృద్ధికి ఊతం

ప్రపంచ వాణిజ్యంలో పర్యాటకరంగం ఎంతో కీలకమైనది. కొన్ని దేశాల ఆర్థికవ్యవస్థలు పూర్తిగా పర్యాటకరంగంపైనే ఆధారపడి ఉన్నాయి. ఈ రంగం ద్వారానే పలు దేశాలకు విదేశీ మారక ద్రవ్యం కూడా సమకూరుతున్నది. అయితే, గత కొన్నేండ్లుగా ప్రపంచవ్యాప్తంగా పర్యాటకం తన స్థాయిని మార్చుకుంటున్నది. ఒకప్పుడు పర్యాటకం ఒక విలాసం కాగా.. ఇప్పుడు అది నిత్యావసరం. ప్రజల జీవన స్థాయిల్లో వచ్చిన మార్పులే అందుకు ప్రధాన కారణం. నేటి సమాజంలో మనిషి నిత్యం ఎన్నో సమస్యలు, ఆలోచనలు, ఒత్తిడితో కూడుకున్న జీవితాన్ని గడుపుతున్నాడు. ముఖ్యంగా బ్యాంకింగ్, ఫైనాన్స్, బీమా, ఐటీ వంటి రంగాల్లో పనిచేసేవారి జీవితం ఎంతో ఒత్తిడితో కూడుకున్నది. అందుకే, అలాంటివారు ఒత్తిడి, సమస్యల కు దూరంగా ఏదో ఒక ప్రదేశానికి వెళ్లి సేద తీరుతున్నారు. గత కొన్నేండ్లుగా పర్యాటక రంగంలో నమోదవుతున్న వృద్ధే అందుకు నిదర్శనం.వరల్డ్ బ్యాంకు డేటా ప్రకారం.. 1995 లో ప్రపంచవ్యాప్తంగా పర్యాటకుల సంఖ్య 1.08 బిలియన్లు ఉండగా.. 2019 నాటికి అది 2.4 బిలియన్లకు చేరుకున్నది. ఇక ఆదాయపరంగానూ పర్యాటకరంగం ముం దంజలో ఉన్నది. 1995లో ప్రపంచవ్యాప్తంగా పర్యాటక ఆదాయం 427.57 బిలియన్ డాలర్లు కాగా.. 2019 నాటికి అది 1.47 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నది. ప్రపంచ పర్యాటక, ప్రయాణ మండలి ప్రకా రం.. 1995లో ప్రపంచ స్థూల జాతీయోత్పత్తిలో ట్రావెల్ అండ్ టూరిజం రంగం వాటా సుమారు 1.5 శాతం ఉండగా అది 2019 నాటికి 10.3 శాతానికి చేరుకున్నది. 2019 నాటికి ప్రపంచవ్యాప్తంగా సుమారు 330 మిలియన్ల మందికి పర్యాటకరంగంలో ఉపా ధి లభించింది.ప్రతీ పది మందిలో ఒకరు పర్యాటకరంగంలో ఉపాధి పొందుతున్నవా రే. ఇక పెట్టుబడుల విషయానికి వస్తే.. 2010లో ఈ రంగంలో సుమారు 754.6 బిలియన్ డాలర్ల పెట్టుబడుల ప్రవాహం ఉం డగా.. అది 2019 నాటికి 1.1 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నది. ఇది మొత్తం ప్రపంచవ్యాప్తంగా అన్నిరంగాల పెట్టుబడుల ప్రవాహంలో 4.5 శాతం. ఈ గణాంకాలు చాలు పర్యాటకరంగం ప్రాముఖ్యాన్ని చెప్పడానికి. ఇక, మన దేశంలోనూ పర్యాటకరంగం చాలా కీలకమైనది. 2001లో విదేశీ పర్యాటకుల రాక కేవలం 2.54 మిలియన్లు ఉండ గా అది 2019 నాటికి 10.93 మిలియన్లకు చేరుకున్నది. అదేవిధంగా, విదేశీ మారక ద్రవ్యం 2001లో 3,198 మిలియన్ డాల ర్లు రాగా.. 2019 నాటికి అది సుమారు 30,058 మిలియన్ డాలర్లకు చేరుకున్నది. 2019 వరకు దూసుకుపోయిన పర్యాటకరంగం కరోనా మహమ్మారి కారణంగా దారుణంగా దెబ్బతిన్నది. మన దేశంతో పాటు, ప్రపంచవ్యాప్తంగా టూరిజం, ట్రావెల్ సంస్థలు ఎన్నడూ లేని గడ్డు పరిస్థితిని ఎదుర్కొన్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ రంగంపై ఆధారపడిన లక్షల మంది రోడ్డునపడ్డారు. పర్యాటకానికి అనుబంధంగా ఉన్న హోటల్, ట్రావెల్, ఇతర సంస్థలు నష్టపోయాయి. అయితే, 2021 నుంచి పర్యాటకరంగం గాడిన పడుతున్నది. ప్రపంచవ్యాప్తంగా పరుగులు పెడుతున్నది. వరల్డ్ టూరిజం బారోమీటర్-2024 నివేదిక ప్రకారం.. అంతర్జాతీయ పర్యాటకుల సం ఖ్య 2020లో 407 మిలియన్లు, 2021లో 457 మిలియన్లు, 2022లో 960 మిలియన్లు, 2023లో 1286 మిలియన్లకు చేరుకున్నది. కానీ, 2019కి ముందర వృద్ధితో పోలిస్తే ఇది చాలా తక్కువ. ఇక అంతర్జాతీయ పర్యాటక ఆదాయం కూడా 2020లో 558 బిలియన్ డాలర్లు, 2021లో 638 బిలియన్ డాలర్లు, 2022లో 1120 బిలియ న్ డాలర్లు, 2023లో 1380 బిలియన్ డాలర్లకు ఎగబాకింది. ఇక భారత్ విషయానికి వస్తే.. 2020లో 2.74 మిలియన్లు, 2021లో 1.52 మిలియన్ల మంది విదేశీ పర్యాటకులే వచ్చారు. ఆ తర్వాత 2022లో 6.44 మిలియన్లు, 2023లో 9.2 మిలియన్లకు ఈ సంఖ్య చేరుకోవడంతో పర్యాటకం తిరిగి పట్టాలెక్కింది. విదేశీ మారక ఆదాయంలోనూ 2020లో 50,136 కోట్ల నుం చి 2023 నాటికి సుమారుగా 1,75,000 కోట్లకు చేరుకున్నది.కరోనా తర్వాత భారత్‌లో పర్యాటక రంగం గాడినపడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకున్నాయి. 2022లో స్వదేశ్ దర్శన్ పథకం కింద 71 ప్రాజెక్టుల అభివృద్ధి కోసం రూ.5,500 కోట్లను కేంద్రం కేటాయించింది. 500కు పైగా పర్యాటక ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచింది. హెరిటేజ్ సర్క్యూట్ థీమ్ కింద 10 కొత్త ప్రాజెక్టులను మంజూరు చేసింది.పర్యాటకం అంటే కేవలం అందమైన ప్రదేశాలు చూడటమే కాదు. వైద్యం, విద్య, వ్యాపార అవసరాలు, విశ్రాంతి తీసుకోవడానికి వివిధ ప్రాంతాలకు వెళ్లేవారిని కూడా పర్యాటకులనే అంటారు. ఇప్పటికే హెల్త్ టూరిజంలో భారత్ ప్రపంచంలోనే 5వ స్థానంలో ఉన్నది. 2023లో భారత హెల్త్ టూరిజం మార్కెట్ 6.79 బిలియన్ డాలర్లకు చేరుకున్నది. ఇలా పర్యాటకం ద్వారా సమకూరే విదేశీ మారక ద్రవ్యం వల్ల రూపా యి బలపడుతున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యల వల్ల పర్యాటకం, దాని అనుబంధ రంగాలు వృద్ధి చెందుతూ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాయి.

# ఢిల్లీలో కేజ్రీవాల్ గేమ్ ప్లాన్ పనిచేసేనా?



న్యూఢిల్లీ,"దిల్లీకి ఒకే ఒక్క ముఖ్యమంత్రి ఉన్నారు, ఆయన పేరు అరవింద్ కేజ్రీవాల్," అని కొత్త ముఖ్యమంత్రి ఆతిషి మర్లీనా ఇటీవల ప్రకటించారు. కేజ్రీవాల్ తన పదవికి రాజీనామా చేసిన 48 గంటల తర్వాత ఈ గంభీరమైన మాటలు వినిపించాయి. దాదాపు దశాబ్ద కాలం నుంచి ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఉన్న కేజ్రీవాల్.. జైలు నుంచి బెయిల్ మీద విడుదలై బయటకు వచ్చిన తర్వాత తన రాజీనామాను ప్రకటించారు. ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఇరుక్కున్న తర్వాత తాను సచ్చీలుడినని ప్రకటించుకోవడానికి, ప్రజలను నమ్మించి.. వారి విశ్వాసాన్ని పొంది, తనపై ఎలాంటి మరకలు లేవని చూపించుకుని మరోసారి ముఖ్యమంత్రిగా ఎన్నికవ్వాలన్నది ఆయన గేమ్ ప్లాన్‌లా కనిపిస్తోంది. అవినీతి ఆరోపణలతో జైలుకు వెళ్లాల్సి రావడంతో ఆయన ఆతిషి మర్లీనాను తన వారసురాలిగా, ఢిల్లీ తదుపరి ముఖ్యమంత్రిగా ప్రకటించారు. అయితే.. ఆతిషికి మాత్రం తన పదవి విషయంలో పూర్తి స్పష్టత కనిపిస్తోంది. తనను కేవలం తాత్కాలికంగానే కుర్చీలో కూర్చోబెట్టారు తప్ప, ఆమ్ ఆద్మీ పార్టీ మళ్లీ గెలిస్తే ఢిల్లీ ముఖ్యమంత్రి పదవి చేపట్టేది కచ్చితంగా అరవింద్ కేజ్రీవాలేనని ఆమెకు స్పష్టంగా తెలుసు.ఢిల్లీలో ఉన్న 70 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికలు 2025 ఫిబ్రవరిలోగా జరగాల్సి ఉంటుంది. అయితే, వీలైనంత వరకు ఒకటి లేదా రెండు నెలల సమయం తీసుకుని ముందస్తు ఎన్నికలకు వెళ్లాలన్నది కేజ్రీవాల్ యోచనలా కనిపిస్తోంది. కేజ్రీవాల్ ఇప్పుడు చేసిన రాజీనామా అనేది మాత్రం "రాజకీయ ఆయుధం" అనే చాలామంది చెబుతున్నారు. దీనిద్వారా తన నైతికతను నిరూపించుకోవాలన్నది ఆయన ప్రయత్నంలా కనిపిస్తోంది. అయితే, అసలు కేజ్రీవాల్.. ఆయన మిత్రబృందం ఎన్ని ప్రయత్నాలు చేసినా, మద్యం కుంభకణం, దానికి సంబంధించిన అవినీతి ఆరోపణల నుంచి బయటపడడం అంత సులభం అయ్యేలా కనిపించడంలేదు. ఇంతకుముందు కూడా ఒకసారి ఆయన ఇలాగే రాజీనామా చేసి తిరిగి భారీ మెజారిటీతో గెలిచినా, అప్పటి పరిస్థితులు, ఇప్పటి పరిస్థితులు వేరు. నవంబర్‌లోనే ఉన్న మహారాష్ట్ర ఎన్నికలతో పాటే ఢిల్లీ ఎన్నికలు కూడా నిర్వహించాలని కేజ్రీవాల్ కోరుతున్నారు. అయితే ఎన్నికల సంఘం మాత్రం ఆయన డిమాండును అంగీకరించే పరిస్థితి కనిపించడం లేదు."ఇది చాలా బాధాకరమైన పరిస్థితి. బీజేపీ కుట్రల కారణంగా మన ప్రియమైన ఢిల్లీ ముఖ్యమంత్రి ఈ రోజు రాజీనామా చేయవలసి వచ్చింది" అని ఆప్ సమావేశం ముగిసిన తర్వాత ఆతిషి అన్నారు. ఢిల్లీకి దాదాపు పదేళ్ల తర్వాత మూడో మహిళా ముఖ్యమంత్రి వచ్చారు. కాంగ్రెస్ నాయకురాలు షీలా దీక్షిత్‌ను కేజ్రీవాల్ ఓడించి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఏకఛత్రాధిపత్యంగా దశాబ్ద కాలం పాటు అధికారాన్ని అనుభవించారు. తనకు అంతగా ప్రాధాన్యం లేనట్లుగానే ఆతిషి చెప్పుకొంటున్నా.. ప్రస్తుతానికి మాత్రం ఆమె ముఖ్యమంత్రి కుర్చీలోనే ఉన్నారు. ప్రస్తుతానికి ముఖ్యమంత్రి బాధ్యతలు లేకపోవడంతో హరియాణా, ఢిల్లీ ఎన్నికల్లో పాల్గొనేందుకు, ప్రచారం చేసుకునేందుకు తగినంత సమయం ఆయనకు దక్కుతుంది. కేజ్రీవాల్‌కు బెయిల్ ఇచ్చేటప్పుడు సుప్రీంకోర్టు విధించిన షరతుల ప్రకారం, ఆయన ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్లకూడదు, ముఖ్యమైన ఫైళ్ల మీద సంతకాలు కూడా చేయకూడదు. సెప్టెంబర్ 13న బెయిల్ మీద కేజ్రీవాల్ బయటకు వచ్చినప్పుడు.. ఆయన నామమాత్ర ముఖ్యమంత్రిగానే ఉంటారని బీజేపీ నాయకులు వ్యాఖ్యానించారు. కానీ, రెండు రోజుల తర్వాత.. కేజ్రీవాల్ తన అమ్ముల పొదిలోంచి రాజీనామా అస్త్రం బయటకు తీశారు. ఆయన తన "అగ్నిపరిక్ష" గురించి మాట్లాడారు. ప్రజల్లోకి వెళ్లి తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకుంటానని చెప్పారు. ఆమ్ ఆద్మీ పార్టీకి ఈసారి కూడా ఎన్నికల్లో విజయం లభిస్తే.. అప్పుడు కేజ్రీవాల్‌తో సహా ఇతర నాయకులు అందరూ కూడా మద్యం కేసులో సుద్దపూసలని నిరూపణ అయినట్లవుతుంది. అప్పుడు కోర్టు కేసులేవీ కేజ్రీవాల్‌ను గానీ, ఆయనతోపాటు మద్యం కేసులో ఉన్న ఇతర మంత్రివర్గ సహచరులను గానీ ఏమీ చేయలేవు. అంటే, రాజకీయంగా అవి పెద్ద ప్రమాదకరంగా పరిణమించవు."అరవింద్‌జీ పార్టీపై దృష్టి పెట్టి, హరియాణా లాంటి రాష్ట్రాలకు వెళ్లి పార్టీని బలోపేతం చేస్తారు. ఆతిషీజీ ప్రభుత్వ సేవల విషయంలో ఎలాంటి అంతరాయం రాకుండా చూసుకుంటారు" అని ఆప్ నాయకుడు ఒకరు అన్నారు. ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల్లోని ఆప్ ప్రభుత్వాలు ప్రధానంగా మొహల్లా క్లినిక్స్, ఆస్పత్రులు, ఉచిత విద్యుత్, నీటి బిల్లుల లాంటి సేవలన్నింటినీ ఆతిషి అత్యంత జాగ్రత్తగా కొనసాగిస్తారు. నిజానికి ఇంతకాలం ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం అంటే.. స్వచ్ఛమైన పాలన, పారదర్శకత, ప్రజలకు నేరుగా కనెక్ట్ అయిన విధానాలు చూపిస్తూ సగర్వంగా చెప్పుకొంటుంది. కానీ కేజ్రీవాల్, ఆయనతోపాటు కొందరు మంత్రులు కూడా ఎదుర్కొంటున్న మద్యం స్కాం ఆరోపణలు ఇన్నాళ్లుగా ఆప్ ప్రభుత్వానికి ఉన్న మంచి పేరును దెబ్బతీసేలా ఉన్నాయి. ఆప్ నాయకత్వంలో ప్రధానమైన వ్యక్తి మనీష్ సిసోదియా కూడా ఇదే "ప్రజల తీర్పు" గురించి మాట్లాడారు, కాని అవినీతి ఆరోపణలతో దాదాపు 17 నెలలకు పైగా జైల్లోనే ఉన్న సిసోదియాను ముఖ్యమంత్రి పదవికి ఇప్పట్లో ఎంపికచేసే అవకాశం లేదు.అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోదియాలతో పాటు.. సౌరభ్ భరద్వాజ్ లాంటి కొందరు ఇతర సీనియర్ నాయకులు ఢిల్లీలో ప్రధానంగా పట్టణ పేదలను కేంద్రబిందువుగా చేసుకుని తమ పార్టీ బలాన్ని ఇన్నాళ్లుగా పెంచుకుంటూ వచ్చారు. ఆతిషి మాత్రం ఈ విషయంలో కొంత సమర్థతను ప్రదర్శించాల్సి ఉంటుంది. మహిళల కోసం నెలకు రూ.1000 అందించే 'ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్ యోజన' వంటి పథకాల అమలుకు ఆమె ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉంది. దీనివల్ల దేశ రాజధాని ప్రాంతంలోని 67 లక్షల మంది మహిళా ఓటర్లు ఆమెవైపు మొగ్గు చూపుతారని భావిస్తున్నారు.కొత్త సీఎం కేజ్రీవాల్‌కు సుదీర్ఘకాలంగా విధేయురాలు. ఉన్నత విద్యావంతురాలు కూడా. ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్స్ కాలేజిలో చదివిన తర్వాత.. ఆమె ఆక్స్‌ఫర్డ్‌లో రోడ్స్ స్కాలర్ షిప్ కూడా పొందారు. రాజకీయాలలో ప్రవేశించాలని భావించిన తర్వాత ఆమె ఆమ్ ఆద్మీ పార్టీలో చేరి.. ఢిల్లీ ప్రభుత్వంలో అపారంగా ఎదిగిపోయారు. సిసోదియా, ఇతర సీనియర్ నేతలు లేకపోవడంతో.. 43 ఏళ్ల వయసులో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆతిషికి అత్యంత ముఖ్యమైన ఆర్థిక, ప్రజాపనపులు, విద్య లాంటి 13 శాఖలు అప్పగించారు. "నేను సాధారణ కుటుంబం నుంచి వచ్చాను. నేను వేరే పార్టీలో ఉండి ఉంటే నాకు కనీసం ఎన్నికల టికెట్ కూడా వచ్చేది కాదు. కానీ కేజ్రీవాల్ జీ నన్ను నమ్మి, నన్ను ఎమ్మెల్యేని చేశారు, మంత్రిని చేశారు, ఈ రోజు నాకు ముఖ్యమంత్రిగా బాధ్యతలు అప్పగించారు" అని పార్టీ సమావేశంలో ఆమె అన్నారు.ఢిల్లీలో 1.47 కోట్ల మంది ఓటర్లు ఉండగా, అందులో సుమారు 45 శాతం మంది మహిళలే. రెండు ప్రధాన కారణాల వల్ల ఆతిషి ఎంపిక సరైనదని ఆప్ వర్గాలు భావిస్తున్నాయి. మద్యం కుంభకోణంలో ఎక్కడా ఆమె పేరు రాలేదు. మహిళలు, మధ్యతరగతి ఓటర్లను ఆమె గణనీయంగా ప్రభావితం చేయగలరు. ఈ రెండు వర్గాలు ఆమ్ ఆద్మీ పార్టీకి ప్రధానమైన ఓటుబ్యాంకుగా ఎప్పటినుంచో ఉన్నాయి.ఇటీవల జరిగిన ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో మాత్రం మొత్తం 12 మునిసిపల్ జోన్లకు గాను ఏడింటిని బీజేపీ గెలుచుకోగా, ఆమ్ ఆద్మీ పార్టీ కేవలం ఐదుచోట్ల మాత్రమే విజయం సాధించగలిగింది. బీజేపీ ఈ ఊపుతో తన దాడిని క్రమంగా పెంచుకుంటూ పోతోంది. "ఢిల్లీ ప్రజలను అడ్డంగా దోచుకున్న అదే మంత్రివర్గంలోనే ఆతిషి కూడా ఉన్నారు. ఆమె కూడా ఆ తాను ముక్కే" అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ వ్యాఖ్యానించారు. మరోవైపు ఆమ్ ఆద్మీ పార్టీ మాజీ శాసనసభ్యుడు, బీజేపీ గూట్లో ఉన్న కపిల్ మిశ్రా ఇటీవల ఆతిషి తల్లిదండ్రుల గురించి కూడా ఒక కొత్త వాదన తీసుకొచ్చారు. వాళ్లిద్దరూ ఢిల్లీ యూనివర్సిటీలో రిటైర్డ్ ప్రొఫెసర్లు, వామపక్ష సానుభూతిపరులు. 2001లో పార్లమెంటు మీద దాడికి పాల్పడిన ఉగ్రవాది అఫ్జల్ గురుకు క్షమాభిక్ష పెట్టాలని వాదించినవారిలో వాళ్లిద్దరూ కూడా ముఖ్యులన్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఇవే ఆరోపణలతో ఆప్‌కు దూరంగా ఉన్న ఆ పార్టీ రాజ్యసభ సభ్యురాలు స్వాతి మలివాల్ అయితే ఒక వీడియో కూడా విడుదల చేశారు. ఇలాంటి కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి ఢిల్లీకి ముఖ్యమంత్రి కావడం రాజధాని ప్రజలు చేసుకున్న అతిపెద్ద దురదృష్టమని ఆమె వ్యాఖ్యానించారు. అయితే, స్వాతి మలివాల్‌కు ఏమాత్రం సిగ్గు, శరం ఉన్నా ఆమె వెంటనే ఆప్ ద్వారా లభించిన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసి, బీజేపీ టికెట్ మీద గెలిచి చూపించి, అప్పుడు మాట్లాడాలని పార్టీ ఎమ్మెల్యే దిలీప్ పాండే అన్నారు. మరోవైపు బీజేపీ నేతలు మాత్రం సామాజిక మాధ్యమాల్లో ఆతిషి మీద విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు. మర్లీనా అంటే మార్క్స్, లెనిన్ ఇద్దరి పేర్ల జోడింపు అని వాళ్లు ఎద్దేవా చేస్తున్నారు.ఎన్నికలు దగ్గర పడేకొద్దీ, ముఖ్యమంత్రి మీద విమర్శల జోరు మరింత పెరుగుతుంది. ప్రస్తుతానికి ఢిల్లీలో ఆతిషి మాత్రమే ఆప్ తురుపుముక్క. మిగిలిన ప్రధాన నాయకులు అందరిమీదా మద్యం కుంభకోణంలో ఆరోపణలు ఉన్నాయి. వాటిని బీజేపీ ఎటూ గట్టిగానే ఉపయోగించుకుంటుంది. ముందస్తు ఎన్నికలు వచ్చినా, లేకపోతే ఎప్పటిలాగే సరైన సమయానికి అంటే 2025 ఫిబ్రవరిలోనే ఎన్నికలు వచ్చినా ఆమ్ ఆద్మీ పార్టీని గెలిపించుకోవడానికి కేజ్రీవాల్ వేస్తున్న ఈ గేమ్ ప్లాన్ ఎంతవరకు విజయవంతం అవుతుందన్నది వేచి చూడాల్సిందే.

# సంప్రదాయాలు పాటించాల్సిందే

తిరుపతి,తిరుమల శ్రీవారిని దర్శించుకోవాలంటే ఎవరైనా సంప్రదాయాలు పాటించాలని సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి స్వామిజీ అన్నారు. తిరుపతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ ఏనాడైనా ఆయన సతీమణిని శ్రీవారి దర్శనానికి తీసుకొచ్చారా? మన ఇంట్లో పూజ చేస్తేనే పక్కన భార్య ఉండేట్లు చూసుకుంటాం. హిందువుల మనోభావాలు, విశ్వాసాలను ఆయన ఏనాడూ గౌరవించలేదని అన్నారు. గతం గతః.. ఇప్పుడు డిక్లరేషన్ ఇవ్వడం ద్వారా ముందుకు సాగాలన్నారు. హిందుత్వానికి కష్టమొచ్చింది.. అందరం ఒక్కటై కాపాడు కోవాలి. తిరుమల క్షేత్ర ప్రాశస్త్యాన్ని వైకాపా ప్రభుత్వం ఎప్పుడూ కాపాడలేదు. గత ఐదేళ్లలో ఎన్నో పాపాలు జరిగాయి.. ప్రక్షాళన జరగాల్సిందే. ఏనాడైనా డిక్లరేషన్‌పై జగన్ సంతకం చేశారా? ఆలయాలు, పూజారులపై దాడులు జరిగినా ఏనాడూ స్పందించలేదు. ఐదేళ్లలో అనేక అఘాయిత్యాలు జరిగాయి. భయానక వాతావరణం సృష్టించారు. ఇలాంటి వాళ్లు తిరుమల క్షేత్రానికి వస్తున్నారంటే జాగ్రత్తగా ఉండాల్సిందే. సనాతన పరిరక్షణ బోర్డు ఏర్పాటు కావాలి. దీనికి రాజకీయ పక్షాలన్నీ సహకరించాలి. జగన్, వైకాపాపై మాకు వ్యక్తిగత ద్వేషం లేదు. ఆలయాల సంప్రదాయాలను గౌరవించకపోవడాన్ని తప్పు పడుతున్నాం. డిక్లరేషన్ ఇచ్చేందుకు అభ్యంతరమేంటని ప్రశ్నించారు. తిరుమల పర్యటనలో కోడికత్తి నాటకాలాడతారని అనుమానాలున్నాయి. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేందుకు యత్నిస్తారనే అనుమానం కలుగుతోంది. గత ఐదేళ్లలో తిరుమలను వ్యాపార కేంద్రంగా మార్చారు. తమ కుటుంబ సభ్యులను పాలకమండలిలో నియమించుకుని అక్రమాలు చేశారు. తిరుమలను శాంతియాగం, ప్రోక్షణతో పవిత్రం చేశారు. జగన్ పర్యటనతో మళ్లీ అపవిత్రమవుతుంది. ఇక్కడికి వచ్చి మరింత క్షోభకు గురిచేయవద్ద అని శ్రీనివాసానంద సరస్వతి వ్యాఖ్యానించారు. ఇకపోతే టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి వ్యాఖ్యలపై స్వామిజీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్ డిక్లరేషన్ ఇవ్వకపోతే దర్శనానికి అనుమతి లేదని చెప్పే హక్కు లేదని భూమన చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. తిరుమల శ్రీవారిని దర్శించుకోవాలంటే డిక్లరేషన్ ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. డిక్లరేషన్ ఇవ్వకపోతే అలిపిరి వద్ద జగన్‌ను అడ్డుకుంటామని హెచ్చరించారు. తిరుపతిలో సేవ్ తిరుమల.. సేవ్ టీటీడీ సమావేశం శుక్రవారం నాడు జరిగింది. ఈ సందర్భంగా సనాతన ధర్మ పరిరక్షణ బోర్డుకు స్వామిజీలు డిమాండ్ చేశారు. గత ఐదేళ్లలో తిరుమల పవిత్రతను కాపాడలేదని విమర్శించారు. తిరుమల శ్రీవారిని దర్శించుకోవాలంటే ఎవరైనా సంప్రదాయాలు పాటించాలని సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి స్వామిజీ అన్నారు. జగన్ ఏనాడైనా ఆయన సతీమణిని శ్రీవారి దర్శనానికి తీసుకొచ్చారా అని ప్రశ్నించారు. మన ఇంట్లో పూజ చేస్తేనే పక్కన భార్య ఉండేట్లు చూసుకుంటామని అన్నారు. హిందువుల మనోభావాలు, విశ్వాసాలను జగన్ ఏనాడూ గౌరవించలేదని విమర్శించారు.

# తీవ్ర ఆందోళనలో సీనియర్ నేత?

హైదరాబాద్,తెలంగాణ కాంగ్రెస్‌లో ఆయన మోస్ట్ సీనియర్ లీడర్. పార్టీలో అత్యంత పలుకుబడిన కలిగిన నేత. MLA, MLCగా పని చేసిన ఆ సీనియర్ లీడర్ పొలిటికల్ జర్నీ ఇప్పుడు అయోమయంలో పడిందా? అన్న అనుమానం మొదలైంది..? పార్టీలో తాజాగా చోటు చేసుకుంటున్న పరిణామాలు ఇబ్బందికరంగా మారాయట..? అందుకే పార్టీ కీలక సమావేశానికి సైతం ఆయన దూరంగా ఉంటున్నారని చెబుతున్నారు ఇంతకీ హస్తానికి దూరంగా దూరంగా ఉంటున్న ఆ నేత ఎవరు? ఆయన ఫ్యూచర్ ఎలా ఉండబోతోందో?

ఆ ఇష్యూతో బాగా కలత చెందారట..

తెలంగాణ కాంగ్రెస్‌లో మోస్ట్ సీనియర్ లీడర్ ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి. సుదీర్ఘ కాలం మంత్రి పదవితోపాటు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాలను శాసించిన జీవన్‌రెడ్డి.. పొలిటికల్ ఫ్యూచర్‌పై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీలో చాలా కీలకంగా ఉంటూ.. పార్టీ గొంతును గట్టిగా వినిపించిన జీవన్‌రెడ్డి వాయిస్ ఇప్పుడు ఎక్కడా వినిపించడం లేదు. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉండగా, పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిచి సత్తా చాటిన జీవన్‌రెడ్డికి.. పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ.. పార్టీలో పరిణామాలు మింగుడుపడని విధంగా తయారయ్యారంటున్నారు. దీంతో ప్రస్తుతం సైలెంట్ అయిపోయారని చెబుతున్నారు. మరీ ముఖ్యంగా తాజాగా చోటు చేసుకున్న ఓ ఇష్యూతో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి బాగా కలత చెందారని వినికిడి. గాంధీభవన్ వేదికగా కొత్త పీసీసీ చీఫ్ నిర్వహించిన సమీక్షా సమావేశాలే ఆయన అసంతృప్తికి కారణమనే టాక్ వినిపిస్తోంది.

ఆహ్వానితుల జాబితాలో పేరు లేకపోవడంతో మనస్థాపం..

పీసీసీ సారథిగా మహేశ్‌కుమార్ గౌడ్ బాధ్యతలు తీసుకున్నాక.. ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమావేశం నిర్వహించగా, సీనియర్ నేత జీవన్ రెడ్డికి అవమానం జరిగినట్లు పార్టీ వర్గాల్లో టాక్ నడుస్తోంది. సమావేశం కోసం సిద్ధం చేసిన ఆహ్వానితుల జాబితాలో జీవన్ రెడ్డి పేరు చేర్చకపోవడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అందరి పేర్లను ముద్రించి.. జీవన్‌రెడ్డిని విస్మరించడంతో ఆయన తీవ్రంగా కలత చెందారని చెబుతున్నారు. ఎట్ ది సేమ్ టైమ్ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పేరు ఉండటం కూడా జీవన్‌రెడ్డిని అసంతృప్తికి గురి చేసిందని చెబుతున్నారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురై.. పీసీసీ చీఫ్ సమక్షంలోనే తన ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేసినట్లు చెబుతున్నారు.

సీనియర్లను విస్మరిస్తున్నారని నిర్వేదం..

గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో జగిత్యాల నియోజకవర్గం నుంచి తన ప్రత్యర్థిగా పోటీ చేసిన వ్యక్తికి కాంగ్రెస్‌లో ప్రాధాన్యమివ్వడాన్ని పెద్దాయన జీర్ణించుకోలేకపోతున్నారని చెబుతున్నారు. ఈ విషయమై తన సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెబుతున్నారు. పార్టీలో కొత్త సాంప్రదాయం తెస్తున్నారని, సీనియర్లను విస్మరిస్తున్నారని జీవన్‌రెడ్డి నిర్వేదం వ్యక్తం చేస్తున్నారంటున్నారు. వలస ఎమ్మెల్యేల విషయంలో పార్టీ తీసుకునే నిర్ణయం పట్ల అసంతృప్తిగా ఉన్నారంటున్నారు.

పార్టీలో చేర్చుకోలేదు అంటూనే సమావేశాలకు ఆహ్వానించడంపై ఆగ్రహం..

బీఆర్ఎస్ నుంచి ఏ ఒక్కరిని చేర్చుకోలేదని బయటకు చెబుతూ.. పార్టీ సమావేశాలకు ఎలా ఆహ్వానిస్తున్నారని ప్రశ్నిస్తున్నారట జీవన్‌రెడ్డి. పార్టీ సమావేశాల్లో తన పేరు ప్రస్తావించకపోవడం కాకతాళీయమని పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, ఇంచార్జ్ దీపాదాస్ మున్షి సర్దిచెప్పే ప్రయత్నం చేసినా.. జీవన్ రెడ్డి మాత్రం.. వారి వాదనతో ఏకీభవించనట్లు చెబుతున్నారు. కావాలనే తనను నిర్లక్ష్యం చేస్తున్నారని అనుమానిస్తున్నారట పెద్దాయన. అందుకే పార్టీ సమావేశాలకు వెళ్లకూడదని నిర్ణయించుకోవడంతోపాటు..

# నిషేధం విధిస్తారా?



హైదరాబాద్,హైదరాబాద్ నగరంలో డీజేలు, టపాసుల వినియోగం తగ్గించేలా చర్యలు చేపడతామని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ చెప్పారు. ర్యాలీల్లో డీజే, టపాసుల వాడకంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ అధ్యక్షతన జరిగిన ఈ మీటింగ్ లో ఎమ్మెల్యేలు, మతపెద్దలు, పలువురు అధికారులు పాల్గొన్నారు. డీజే శబ్దాలపై భారీగా ఫిర్యాదులు వస్తున్నాయని, వృద్ధులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని సీపీ చెప్పారు. డీజే సౌండ్లు శ్రుతి మించుతున్నాయన్నారు. పబ్ లలో మాదిరిగా ర్యాలీలలో చేస్తున్నారని, వారిని కంట్రోల్ చేసేందుకు చర్యలు చేపడతామని కీలక వ్యాఖ్యలు చేశారు.రోజురోజుకి పెరిగిపోతున్న డీజేలు, టపాసుల శబ్దాలను కంట్రోల్ చేసేందుకు హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ నడుం బిగించారు. మూడు కమిషనరేట్లకు సంబంధించి ఇవాళ రౌండ్ టేబుల్ మీటింగ్ ఏర్పాటు చేశారు. వివిధ కమిషనరేట్ల పోలీసులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మత పెద్దలు సమావేశానికి వచ్చారు. వారి నుంచి కీలక సమాచారం తీసుకున్నారు. హైదరాబాద్ నగరంలో జరిగే రాజకీయ పార్టీల ర్యాలీలు కావొచ్చు, పండుగలు కావొచ్చు.. వ్యక్తులు పర్సనల్ గా జరుపుకునే ప్రోగ్రామ్స్ కావొచ్చు.. వీటిలో డీజేలతో పాటు పటాసుల వినియోగం ఏటేటా గణనీయంగా పెరిగిపోతోంది. రీసెంట్ గా గణేశ్ నిమజ్జన కార్యక్రమంలో పెద్దఎత్తున డీజేల వినియోగం జరిగింది. దీనిపై స్థానికుల నుంచి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందినట్లుగా తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో రానున్న రోజుల్లో డీజే శబ్దాలతో పాటు టపాసుల వినియోగాన్ని కంట్రోల్ చేసేందుకు పోలీసు శాఖ నడుం బిగించింది.డీజే శబ్దాలను కట్టడి చేసేందుకు హైదరాబాద్ పోలీసులు ఓ ప్రణాళికబద్దంగా ముందుకెళ్తున్నారు. అందులో భాగంగానే ఇవాళ మూడు కమిషనరేట్లకు సంబంధించిన పోలీసు ఉన్నతాధికారులతో పాటు జీహెచ్ఎంసీ అధికారులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, మత పెద్దలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వివిధ వర్గాల నుంచి అనేక విజ్ఞప్తులు, ఫిర్యాదులు, విన్నపాలు అందాయి.గత కొన్ని రోజులుగా హైదరాబాద్ నగరంలో నార్త్ ఇండియాకు సంబంధించిన కల్చర్ పెరిగిపోతోంది. సంప్రదాయ పద్ధతుల్లో నిర్వహించాల్సిన పండుగల్లో డీజేల వినియోగం పెరిగిపోతోంది. ఆగడాలు పెరిగిపోతున్నాయి. దీనిపై ఎక్కువ ఫిర్యాదులు అందాయి. గణేశ్ నిమజ్జన సమయంలో.. మండపం నుంచి నిమజ్జన ఘట్టానికి వెళ్లే ప్రాంతం వరకు కూడా డీజేల సౌండ్లు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనిపై జీహెచ్ఎంసీ అధికారులకు, పోలీసులకు పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలో డీజే మోతలు, టపాసుల వినియోగం కట్టడికి పోలీసులు నడుంబిగించారు.అయితే, దీనిపై ఎమ్మెల్యే రాజాసింగ్ అభ్యంతరం తెలిపారు. హిందువుల పండుగల సందర్భాల్లోనే పోలీసులు ఆంక్షలు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రౌండ్ టేబుల్ మీటింగ్ లో పాల్గొన్న రాజాసింగ్.. డీజేల వాడకంపై నిషేధం అంశాన్ని తాము పూర్తిగా వ్యతిరేకిస్తామన్న పరిస్థితి ఉ

# పెన్‌గంగ ఇసుక తోడేస్తున్నారు

ఆదిలాబాద్, ఇసుక రవాణాను అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరించడంతో అక్రమ వ్యాపారులు జోరుగా ఇసుక తరలిస్తూ నిల్వ చేసుకుంటున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా దందా మాత్రం ఆగడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇసుకకు ప్రస్తుతం డిమాండ్ పెరగడంతో వ్యాపారు లకు కాసులు కురిపిస్తున్నాయి. గ్రామాలలోని ప్రతి ఒక్కరూ ట్రాక్టర్లను కొనుగోలు చేసి ఇసుక దందాను ఎంచుకుంటున్నారు. ఎటువంటి డబ్బులు చెల్లించకుండా ఇసుకను తోడుకుని అమ్ముకోవడంతో వ్యాపారు లకు కాసుల వర్షం కురుస్తుంది. ప్రస్తుతం వరదనీరు గంగలోకి రావడంతో ఇసుక తీసే వీలులేక ప్రస్తుతం తాంసి(కె) నుంచి పిప్పల్‌కోటి మీదుగా కప్పర్ల, బండల్‌నాగాపూర్, పొచ్చేర, లేకపోతే సావర్గాం, జంధాపూర్ గ్రామాల మీదుగా జిల్లా కేంద్రానికి ఇసుకను తరలిస్తున్నారు. తాంసి(కె) వద్ద గంగాలోని ఇసుక బాగుండడంతో భారీ రేటు కూడా పలుకడంతో ట్రాక్టర్ల యాజమానులు, వ్యాపారులు పెన్‌గంగ నది నుంచి ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు. రోజుకు ట్రాక్టర్ ద్వారా ఒక్కో ట్రాక్టర్ ద్వారా రెండు ట్రిప్పుల ఇసుకను తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ (ట్రిప్పు) ఇసుకకు రూ.3 నుంచి నాలుగు వేలకు విక్రయిస్తున్నారు. ఇలా నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పెన్‌గంగ నుంచి ఇసుకను నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేస్తే కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నా ఫలితం కానరావడం లేదు. గ్రామాలలో స్థానికంగా ఉన్న చిన్నచిన్న అవసరాల మేరకు ఇసుకను వాడుకునేందుకు ఇచ్చిన అవకాశాన్ని దుర్వినియోగం చేస్తూ కాంట్రాక్టర్లకు, ఇతర అవసరాలకు ఇసుకను రవాణా చేస్తూ కాసులు సంపాదించుకుంటున్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలి. సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడంతో ఇసుకను పెన్‌గంగా నది నుంచి యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఇసుక తరలిస్తూ ట్రాక్టర్లు పట్టుబడితే నామమాత్రంగా జరిమానా విధిస్తూ చూసిచూడనట్లు వ్యవహరించడంతో ఇసుక వ్యాపారులు తమ పంథాను మార్చుకోకుండా ఇసుకను తరలిస్తున్నారు. పెన్‌గంగా నదితీరం నుంచి గంగాపై భాగంలో ఇసుకను రవాణా చేసే వ్యాపారులు ఇసుక డంపులను ఏర్పాటు చేసి ఇసుకను నిల్వ చేసుకుంటున్నారు. పెన్‌గంగా నది నుంచి నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు ఇసుక కొరతను సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. వర్షాకాలం పెన్‌గంగా నదిలోకి వరదనీరు చేరితే ఇసుక తీసే అవకాశం ఉండదు.. ప్రస్తుతం గంగలో నుంచి కూలీల ద్వారా ఇసుకను తీసుకువచ్చి గంగనది తీరంలో మైదాన ప్రాంతంలో డంపులను ఏర్పాటు చేస్తున్నారు.దీంతో ఇసుక వ్యాపారం జోరుగా సాగుతోంది. ఇసుకను అక్రమంగా తరలిస్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు ఆ వైపుగా చూడకపోవడంతో అక్రమార్కులు యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ పెన్‌గంగాను తోడేయం మానడం లేదు. రోజుకు 50 ట్రాక్టర్ల ట్రిప్పులను తరలిస్తున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పెన్‌గంగ నదిలో నుంచి నిత్యం పదుల సంఖ్యల్లో ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ఇష్టానుసారంగా ఇసుకను తోడేస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాలలోని వివిధ గ్రామాలకు ట్రాక్టర్లలో పరిమితికి మించి ఇసుకను తరలిస్తున్నారు.

# హైడ్రా దూకుడుతో నేతల ఉలికిపాటు

హైదరాబాద్, అక్రమార్కులను హడలెత్తిస్తోన్న హైడ్రా పేరు చెబితేనే రాజకీయ నాయకులకు కూడా కంటిమీద కునుకు పట్టడం లేదు. కెసిఆర్ హయాంలో అక్రమాలను కూల్చేస్తామని హడావిడి చేశారు. అప్పుడే ఎన్ కన్వెన్షన్, అయ్యప్ప సొసైటీలపై పడ్డారు. కానీ తరవాత ఏదో మతలబు జరిగింది. ఆగిపోయారు. ఇప్పుడు వారే అంటే కెసిఆర్ తనయుడు, అనుయాయులు హైడ్రా చర్యలను కూల్చేస్తున్నారు. ఒకడు చెరువులోనే బిల్డింగ్ కట్టుకుంటే వదిలేయాలా అన్నది ఇప్పుడే పెద్దమనుషులు చెప్పాలి. హైడ్రా తరహా చర్యలు తీసుకోవాలని సర్వత్రా ఇప్పుడు డిమాండ్ వస్తోంది. కానీ కెటిఆర్, ఈటెల రాజేందర్, లాంటి వారు మాత్రం హైడ్రాపై విమర్శలు గుప్పిస్తున్నారు. అంటే అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నారని అనుకోవాలి. ఇప్పటికే తెలంగాణ కేబినెట్ హైడ్రాకు చట్టబద్దతకల్పిస్తూ నిర్ణయం తీసుకుంది.. మిషన్ మూసీ ప్రక్షాళనలో హైడ్రాకు ఫుల్ పవర్స్ ఇచ్చారు సీఎం రేవంత్ రెడ్డి. తాజాగా హైడ్రాలో కొత్తగా 169 సిబ్బందిని కేటాయించారు. డిప్యుటేషన్‌పై వివిధ విభాగాల్లోని సిబ్బందిని హైడ్రాకు అటాచ్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నలుగురు అదనపు కమిషనర్లు, ఐదుగురు డీసీపీలు, 16 మంది ఇన్‌స్పెక్టర్లు, 16 మంది ఎస్సైలు, 60 మంది కానిస్టేబుళ్లు, 12 మంది స్టేషన్ ఫైర్ ఆఫీసర్లు, 10 మంది అసిస్టెంట్ ఇంజనీర్లు సహా సైంటిస్ట్, తహసీల్దార్లు, సర్వేయర్ ,ఫారెస్ట్ ఆఫీసర్‌తో హైడ్రా మరింత బలోపేతమైంది. తిరుగులేని బాణంలా దూసుకెళ్తోన్న హైడ్రా.. ఇప్పుడు మరింత బలోపేతం అవుతుంది. చెరువులు, నాలాలపై కబ్జాల కబ్జా తొలగింపుకు సీఎం రేవంత్ రెడ్డి హైడ్రాకు ఫుల్ పవర్స్ ఇచ్చారు. అయితే, ఆక్రమణలను తొలగించడం మంచిదే.. కానీ సంపన్నుల విషయంలో ఒకలా.. నిరుపేదల విషయంలో మరోలా వ్యవహరిస్తున్నారని విపక్షాలు కస్సుబుస్సు చేస్తున్నాయి. హైడ్రా పేరుతో హైడ్రామాలు చేస్తున్నారన్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. బాధితులకు బీఆర్ఎస్ అండగా వుంటుందన్నారు. అవసరమైతే బుల్డోజర్‌కు అడ్డుగా తాము నిలబడతామన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా లీగల్ ఎయిడ్ అందిస్తామన్నారు. హైడ్రా ముసుగులో పేదలపై దుర్మార్గపు చర్యలను ఆపాలని బీజేపీ నేత, ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. లేదంటే ఉద్యమం తరహాలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. కాంగ్రెస్ సర్కారు తప్పుల చిట్టాను ప్రజల్లోకి తీసుకెళ్తామని ఈటల చెప్పారు. హైడ్రా యాక్టివిటీ హద్దుల్లో ఉండాలంటున్నాయి విపక్షాలు .పర్యావరణ పరిరక్షణకే లక్ష్యం.. చెరువులు, నాలాలపై కబ్జాలను తొలగించడమే మార్గం అంటూ హైడ్రాను ప్రభుత్వం మాత్రం మరింత బలోపేతం చేస్తున్నది. సవాళ్ల -ప్రతిసవాళ్లతో బుల్డోజ్ పాలిటిక్స్ మరింతగా హీటెక్కుతున్నాయి. అయితే మంచిని మంచిగా స్వాగతించాలి. అప్పుడే విపక్ష రాజకీయాలను ప్రజలు కూడా స్వాగతిస్తారు.

### ఎప్పటిపని అప్పుడే చేయాలి !

తిరుమల: పనిని వాయిదా వేయడం సరికాదు. ఎప్పటి పని అప్పుడే చేయాలి. పని చేయడానికి కార్యాచరణ కూడా అవసరం. రేపటి పనిని నేడు, నేటి పనిని ఇప్పుడే చేయాలని కార్యదీక్ష కలవాళ్లు అనుకుంటారు. అలా చెయ్యడానికి పూనుకొంటారు. అప్పుడే పనులవేగం పెరుగుతుంది. తక్కువ సమయంలో ఎక్కువ పనులు చేయడానికి వీలవుతుంది. మన జీవితకాలంలో ఏమి సాధించామన్నదే జీవన సాఫల్య గణనలోకి వస్తుంది. అంతేతప్ప, ఎన్నాళ్లు జీవించామనేది లెక్కలోకి రాదు. తెలివైన తెలివితేటలున్నవారు కాలాన్ని వ్యర్థం చెయ్యరు. ప్రతి క్షణాన్నీ ఎలా సద్వినియోగం చెయ్యాలో ముందుగానే

# నాలుగో నగరం... ఫ్యూచర్ సిటీగా ముచ్చర్ల



హైదరాబాద్:హైదరాబాద్ మహానగరాన్ని మూసీనది ఒడ్డున నిజాం రాజైన మహమ్మద్ కులీ కుతుబ్ షా నిర్మించారు. నగరానికి 434 ఏళ్ల చరిత్ర ఉంది. నాడు నవాబులు నిర్మించిన నగరం దినదినాభివృద్ధి చెందుతూ దేశంలోనే 5వ అతిపెద్ద మహానగరంగా గుర్తింపు సాధించింది. హస్తకళలు, ఉద్యానవనాలు, నాట్యానికి ప్రసిద్ధి చెందిన హైదరాబాద్ నేడు ఐటీ నగరంగా ప్రఖ్యాతి పొందింది. హైదరాబాద్, సికింద్రాబాద్, ఆ తర్వాత సైబరాబాద్ నగరాలుగా అభివృద్ధి చెందింది. హైదరాబాద్ మహానగరాన్ని కులీ కుతుబ్ షా నిర్మించింది చరిత్ర. కానీ నాలుగో నగరాన్ని రంగారెడ్డి జిల్లా ముచ్చర్లలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించపోయేది మాత్రం మన కళ్ల ముందు జరుగుతుంది. నాడు కులీ కుతుబ్ షా భాగ్యనగరాన్ని నిర్మించడం ఎంత నిజమో.. నేడు సీఎం రేవంత్‌రెడ్డి నాలుగో నగరాన్ని నిర్మించడం చరిత్రలో నిలిచిపోనుంది. హైదరాబాద్ మహానగరం విశ్వనగరంగా పేరు, ప్రఖ్యాతలు సాధించనుంది. ఇదే కాకుండా సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా హైదరాబాద్ చుట్టు పక్కల ఉన్న గ్రామాలు, మున్సిపాలిటీలను కలిపితే ప్రపంచంలోని మహానగరాలలో 41వ స్థానంలో నిలువనుంది. తెలంగాణలో అధికారంలో ఉన్న రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగో నగరంగా ముచ్చర్ల అనేది కీలక నిర్ణయంగా భావించాలి. నాడు నవాబులు నగరాన్ని తొలుత చించలం(నేటి శాలిబండ) అనే చిన్న గ్రామంలో నిర్మిస్తే.. నేడు రేవంత్‌రెడ్డి ముచ్చర్ల కేంద్రంగా ప్రస్తుతం 13,972 ఎకరాలలో ఫ్యూచర్ సిటీని నిర్మించడం విశేషం.అభివృద్ధి చెందిన దేశం అమెరికా. అమెరికాలోనే న్యూయార్క్ సిటీ ఉంది. న్యూయార్క్ నగరం కంటే కూడా అద్భుతంగా ముచ్చర్లలో నిర్మాణం అవుతున్న ఫ్యూచర్ సిటీ (నాలుగో నగరాన్ని) తీర్చిదిద్దనున్నట్టుగా ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం తన ముందున్న విజన్‌కు అందరం హర్షించాల్సిందే. మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 2047 నాటికి వందేళ్లు నిండనున్నాయి. దీంతోనే కేంద్ర ప్రభుత్వం 2047 నాటికి వికసిత భారత్(అభివృద్ధి చెందిన దేశం)గా అంటుంది. కానీ సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం అమెరికాలో అత్యంత పేరు, ప్రఖ్యాతలున్న న్యూయార్క్ నగరంతోనే ఫ్యూచర్ సిటీ పోటీ పడుతుందని ప్రకటించడం మరో గొప్ప విషయంగా భావించాలి. అంతర్జాతీయంగా హైదరాబాద్‌కు అన్ని రంగాలలో పేరుంది. ఫ్యూచర్ సిటీ నిర్మాణంతో హైదరాబాద్ మహానగరం విశ్వనగరంగా వృద్ధి చెందనుంది.మన దేశానికి ఆర్థిక నగరమైన ముంబయి నగరం అభివృద్ధిలో భాగంగా దీనిపై పై ఒత్తిడి తగ్గించడం కోసం నవీ ముంబయిని తీర్చిదిద్దింది. నేడు ప్రపంచంలోనే అత్యుత్తమైన, అతిపెద్ద ప్రణాళికాబద్ధమైన శాట్‌లైట్ టౌన్‌షిప్‌లలో ఒకటిగా నిలిచింది. దేశంలో పట్టణీకరణ ప్రక్రియలో 39,420 ఎకరాల విస్తీర్ణంతో అద్భుతమైన నగరంగా పేరొందింది. సిటీ అండ్ ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(సిడ్కో) ఆధ్వర్యంలోనే అన్ని రంగాలలో ప్రణాళికబద్ధంగా అభివృద్ధిని సాధించింది. వాణిజ్య, వ్యాపార, విద్యా సంస్థలకు కేంద్రంగా నిలిచింది. వివిధ బహుళజాతి సంస్థల కార్యాలయాలు సైతం నగరం అంతా విస్తరించి ఉన్నాయి. దేశ రాజధాని ఢిల్లీపై జనాభా భారాన్ని తగ్గించేందుకు రాజధాని చుట్టూ నివాస, పారిశ్రామిక ప్రాంతాలను ఒక ప్రణాళిక ప్రకారం అభివృద్ధి చేయడం జరిగింది. అందులో భాగంగానే హర్యానా సరిహద్దులోని గుర్గావ్, ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలను అభివృద్ధి చేశారు. గ్రేటర్ నోయిడా 38,000 హెక్టార్లల్లో ఒక ప్రణాళికబద్ధమైన నగరంగా నిర్మించబడింది. నేడు గ్రేటర్ నోయిడా ఐటీ, కార్పొరేట్, పారిశ్రామిక, ఇతర బహుళజాతి సంస్థలకు కేంద్రంగా మారింది.నవీ ముంబయి, గ్రేటర్ నోయిడాలను తలతన్నేలా నాలుగో నగరంగా ముచ్చర్లను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతుంది. అంతర్జాతీయ పెట్టుబడులతో మహాద్భుతమైన నగరంగా నిర్మాణం చేయనుంది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు బృందం అమెరికా, దక్షిణ కొరియాలకు వెళ్లి ఫ్యూచర్ సిటీలో విదేశీ పెట్టుబడులను ఆహ్వానించిన విషయం తెలిసిందే. ప్రముఖ, దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో భేటీ అయి నాలుగో నగరం గురించి వివరించి ఇక్కడ పెట్టుబడు పెట్టాల్సిందిగా కోరారు. మొత్తంగా 7 రోజుల అమెరికా, రెండు రోజుల దక్షిణ కొరియా పర్యటనలలో అమెరికా నుంచి రూ.31,502 కోట్లు, దక్షిణ కొరియా నుంచి రూ.4,500 కోట్ల విలువైన పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయి. దీంతో సుమారు 30,750 మందికిపైగా ఉద్యోగాలు రానున్నాయి. మెట్రో రైలుతో పాటు ఇతర రవాణా వ్యవస్థను అనుసంధానం చేయనున్నారు. నవీ ముంబయి తరహాలోనే నాలుగో నగరం అభివృద్ధికి కార్పొరేషన్ లేదా ఒక అథారిటీని ఏర్పాటు చేసి దాని కిందనే అభివృద్ధి, నిర్వహణను చేపడితే సీఎం రేవంత్‌రెడ్డి కలలుకంటున్న న్యూయార్క్ తరహాలో తీర్చిదిద్దడం ఖాయంగా కనిపిస్తోంది. దీనికి అనేక కారణాలున్నాయి. దేశంలో సముద్రాలు లేకుండా విస్తరించేదుకు, పట్టణీకరణకు అవకాశం ఉన్నవి కర్ణాటకలో బెంగళూరు, తెలంగాణలో హైదరాబాద్ మాత్రమే. నాలుగో నగరంగా నిర్మాణం చేసే ప్రాంతంలో ఐటీ, పారిశ్రామిక, నివాసం, ఇతర అన్ని రంగాలకు అనువైన వేలాది ఎకరాల భూమి అందుబాటులో ఉంది. ఫోర్త్ సిటీ లో హైదరాబాద్ సిటిలో ఉన్నట్లుగానే రాబోయే 50 ఏళ్లను దృష్టిలో పెట్టుకొని ఇక్కడ మౌలిక సదుపాయాలు, ప్రధానంగా విశాలమైన రోడ్లు, త్రాగునీటి సౌకర్యాలు, విద్యా, వైద్య సౌకర్యాలను పక్కా ప్రణాళికబద్ధంగా ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుంది.ఒక నగరం అత్యుత్తమ నగరంగా గుర్తింపును సాధించాలంటే ప్రధానంగా కావాల్సినవి విశాలమైన రహదారులు, తగినంత తాగునీరు, మంచి ట్రాఫిక్ నిర్వహణ, కట్టుదిట్టమైన శాంతి భద్రతలు, పారిశుధ్య నిర్వహణ, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, నాణ్యమైన విద్యుత్ సరఫరా, మంచి కమ్యూనికేషన్ వ్యవస్థ, స్వచ్ఛమైన వాతావరణం వంటివి ఉండాలి. ఇవన్నీ కూడా నాలుగో నగరానికి ఉన్నాయి. శ్రీశైలం హైవేతో ఈ ప్రాంతానికి ప్రస్తుతం చక్కని రోడ్ కనెక్టివిటీ ఉంది. అందుబాటులోనే అంతర్జాతీయ శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ ఉంది. ఇక్కడ నుంచి మెట్రోను ముచ్చర్ల వరకు పొడిగించుకునే అవకాశం ఉంది. ఒక పక్కన ఓఆర్ఆర్, మరో పక్కన ఆర్ఆర్ఆర్ సైతం అందుబాటులో ఉండటం మరో గొప్ప విషయం.ముచ్చర్ల ప్రాంతంలో ప్రభుత్వం సేకరించిన 20 వేల ఎకరాల భూములున్నాయి. ఇక్కడి భూములను పలు జోన్లుగా విభజించి ఎలక్ట్రానిక్, జనరల్ ఇండస్ట్రీస్, లైఫ్ సైన్స్ హబ్, నివాస-వాణిజ్య అవసరాలు, ఆసుపత్రులు, విద్యాలయాలు, క్రీడా మైదానాలు, ఆతిథ్య, వినోదం, పర్యాటకం, తదితర విభాగాలకు కేటాయించి దీరి కోసం ప్రత్యేక అథారిటీని ఏర్పాటు చేసి ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేస్తే మరో అద్భుతమైన నగరంగా నాలుగో నగరం రూపుదిద్దుకోనుంది. ఇదే ప్రణాళికతో సీఎం రేవంత్‌రెడ్డి నాలుగో నగరం అభివృద్ధి, విస్తరణకు అడుగులు వేస్తున్నారు. ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా 1000 ఎకరాలలో జూ పార్క్‌ను ఏర్పాటు చేయనున్నట్టుగా సీఎం ప్రకటించారు. బీసీసీఐతో చర్చించి 100 ఎకరాలలో క్రికెట్ స్టేడయాన్ని సైతం ఏర్పాటు చేయనున్నట్టుగా ఇప్పటికే ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుతం ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం 30 ఎకరాల లోపే ఉంటుంది. కానీ నాలుగో నగరంలో ఏకంగా 100 ఎకరాలలో ఏర్పాటు చేసే స్టేడియానికి అంతర్జాతీయంగా గుర్తించు తెచ్చుకోనుంది.నాలుగో నగరం కృత్రిమ మేధ నగరిగా గుర్తింపును తెచ్చుకోనుంది. అర్టిఫిషియల్ ఇంటలిజెన్సీ(ఏఐ) అభివృద్ధి, విస్తరణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. రానున్న కాలంలో ఏఐకీ కేరాఫ్‌గా నాలుగో నగరం మారే అవకాశం ఉంది. నాలుగో నగరంలో కృత్రిమ మేధ నగరానికి 297 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. నాలుగో నగరం ఏర్పాటుకు బెగరికంచలో సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రుల చేతుల మీదుగా యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి శంకుస్థాపన జరిగిన రోజే బీజం పడిందని చెప్పుకోవచ్చు. ఈ వర్సిటీ ఏర్పాటును కూడా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. రాష్ట్రంలోని యువతను ప్రపంచ స్థాయిలో ఉద్యోగులుగా తీర్చిదిద్దే సాంకేతిక నైపుణ్యాన్ని ఈ వర్సిటీ అందించనుంది. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ముందుగా కోర్సులను అందుబాటులోకి రానున్నాయి. దీంతో పాటు క్రీడా, ఇతర విశ్వవిద్యాలయాల కోసం ప్రత్యేకమైన జోన్‌గా ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు 454 ఎకరాలను కేటాయించారు. ఎలక్ట్రానిక్స్, సాధారణ పరిశ్రమలను కూడా ఏర్పాటుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. 4,774 ఎకరాలలో అతిపెద్ద పారిశ్రామిక జోన్‌ను ఏర్పాటు చేయనుంది. వీటిని స్థాపించేందుకు విదేశీ సంస్థలు సైతం ఆసక్తి చూపుతున్నాయి. కొంగర్‌కలాన్‌లో ఆపిల్ ఫోన్ విడి భాగాలను తయారు చేస్తున్న ఫాక్స్‌కాన్ సంస్థ ఎలక్ట్రానిక్స్ జోన్‌లో తన శాఖలను ప్రారంభించేందుకు ఇప్పటికే సన్నాహాలు చేస్తోంది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నాలుగో నగరం ఉండాలి. అందుకు ప్రత్యేకంగా 470 ఎకరాలలో ఎంటర్‌టైన్‌మెంట్ జోన్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇండస్ట్రీయల్ పార్కులే కాదు.. సరికొత్తగా ఫర్నిచర్ పార్క్‌ను 309 ఎకరాలలో అందుబాటులోకి తేనున్నారు. ఆహారం ఎంత ముఖ్యమో ఆరోగ్యం కూడా అంతే ముఖ్యం. అందుకే ఫ్యూచర్ సిటీలో 370 ఎకరాలలో హెల్త్‌సిటీని కూడా నిర్మించనున్నారు. ఇప్పటికే దేశంలోనే వైద్య రాజధానిగా హైదరాబాద్ పేరు తెచ్చుకుంది. హెల్త్‌సిటీ రాకతో ప్రపంచ దేశాల చూపంతా కూడా దీనిపైనే పడనుంది. నాలుగో నగరం విద్యానగరంగా కూడా తీర్చిదిద్దనున్నారు. అందులో ప్రత్యేకంగా లైఫ్‌సైన్స్‌కు జీవం పోసే విధంగా 4,207 ఎకరాలలో లైఫ్‌సైన్స్ హబ్‌నే ఏర్పాటు చేయనున్నారు. ఈ జోన్‌లో ప్రాణాధార మందుల తయారీ, పరిశోధన సంస్థలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వనుంది. ఇది అందుబాటులోకి అంతర్జాతీయంగా కూడా గుర్తింపును సాధించుకోవచ్చు.బంజారహిల్స్, జూబ్లీహిల్స్‌లను తలదన్నేలా.. వాణిజ్యం, వ్యాపార పరంగా కూడా రాణించేందుకు కూడా ప్రత్యేక ప్రాంతాలను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు 1,317 ఎకరాల భూమిని కేటాయించారు. క్రీడలకు ప్రాధాన్యత, క్రీడాకారులు ఈ ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహాన్ని అందిస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో క్రీడా రంగంలో రాణించేందుకు ఏకంగా స్పోర్ట్స్ హబ్‌ను సైతం ఏర్పాటు చేసేందుకు 761 ఎకరాలను కేటాయించారు. అందుకే కావొచ్చు.. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి అవకాశం ఇస్తే ఒలంఫిక్స్‌ను హైదరాబాద్‌లో నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో 57 ఎకరాల్లో రూ.150 కోట్ల వ్యయంతో ఈ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని నిర్మించనున్నట్లుగా ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించి ఉన్నారు, గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన వారికి ఈ స్కిల్ యూనివర్సిటీ ద్వారా నైపుణ్యం కల్పించి.. వారిని కంపెనీలకు అనుకూలంగా మార్చనున్నట్లుగా ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేసిన విషయం తెలిసిందే. అంతర్జాతీయంగా గుర్తింపుతో పాటు పేరు, ప్రఖ్యాతలను మన రాష్ట్రానికి తెచ్చి పెట్టే విధంగా రాష్ట్ర ప్రభుత్వం గొప్ప సంకల్పంతో నాలుగో నగర నిర్మాణికి భీజం వేసింది. ఈ నాలుగో నగరం మహాద్భుతమైన నగరంగా నిర్మాణం కావాలని ఆశిద్దాం.

# టూరిజం అభివృద్ధిలో దక్షిణ మధ్య రైల్వేదే కీలక పాత్ర

న్యూఢిల్లీ,గొప్ప సాంస్కృతిక వారసత్వంతో కూడిన అద్భుతమైన పర్యాటక ప్రాంతాలకు భారతదేశం ప్రసిద్ధి గాంచింది. దేశవ్యాప్తంగా పర్యటించాలనుకునే ఔత్సాహిక పర్యాటకులకు సాధ్యమైనంత ఉత్తమ సేవలను అందించడంలో దక్షిణ మధ్య రైల్వే అగ్రగామిగా ఉంది. ఈ దిశలో భాగంగా దక్షిణ మధ్య రైల్వే భారతదేశంలోని అన్ని ప్రధాన నగరాలకు, దేశంలోని అన్ని ముఖ్యమైన యాత్రా కేంద్రాలకు రైళ్లను నడుపుతోంది.

ఆంధ్ర-తెలంగాణను కలుపుతూ..

భారతదేశంలోని దక్షిణ, ఉత్తర, పశ్చిమ ప్రాంతాలలో ముఖ్యమైన ఆధ్యాత్మిక గమ్యస్థానాలతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కలుపుతూ 25 భారత్ గౌరవ్ రైళ్ల సేవలను దక్షిణ మధ్య రైల్వే నిర్వహించింది. మూడు ప్రధాన సర్క్యూట్లలో యాత్రికుల సౌకర్యార్థం భారత్ గౌరవ్ టూరిస్ట్ సర్క్యూట్ రైళ్లు నడుస్తున్నాయి. "జ్యోతిర్లింగ సహిత దివ్య దక్షిణ్ యాత్ర" పర్యటన తిరువణ్ణామలై అరుణాచలం, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేండ్రం, తిరుచ్చి మరియు తంజావూరులను కవర్ చేస్తుంది.అయోధ్య - కాశీ: పుణ్య క్షేత్ర యాత్ర పర్యటనలో కొత్తగా నిర్మించిన రామజన్మభూమి (అయోధ్య), కాశీ విశ్వనాథ ఆలయం, గయ దర్శనం ఉంటుంది. సప్త జ్యోతిర్లింగ దర్శన యాత్ర పర్యటన ఉజ్జయిని (మహాకాళేశ్వరం నుండి ఓంకారేశ్వర్), ద్వారక, సోమనాథ్, పూణే (భీమ శంకర్), నాసిక్ (త్రయంబకేశ్వర్), మరియు ఔరంగాబాద్ (గ్రీష్ణేశ్వర్ ఆలయం)లను కవర్ చేస్తుంది.. దక్షిణ మధ్య రైల్వేలో 'భారత్ గౌరవ్' రైళ్లు భారీ విజయాన్ని సాధించాయి.

భారత్ గౌరవ్ రైళ్లు ఫుల్..

ఇప్పటివరకు నడిచిన 'భారత్ గౌరవ్' అన్ని ట్రిప్పులకు స్థిరంగా మంచి ఆదరణ చేకూరింది.దక్షిణ మధ్య రైల్వే శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించడంలో కూడా కీలక పాత్ర పోషిస్తుంది. రైలు మౌలిక సదుపాయాల కల్పన మరియు మెరుగైన రైలు అనుసంధానంతో తిరుమలలోని వెంకటేశ్వర స్వామి ఆలయానికి నిరంత సౌకర్యవంతమైన ప్రయాణానికి మార్గం సుగమం చేశాయి. శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం భక్తి సంప్రదాయానికి మహోన్నతమైన చిహ్నంగా నిలుస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి/చిత్తూరు జిల్లాలో ఉన్న ఈ ఆలయం ప్రపంచంలోని అతి ముఖ్యమైన పుణ్యక్షేత్రాలలో ఒకటి. ప్రతి ఏటా లక్షలాది మంది భక్తులను ఆకర్షిస్తుంది. ఈ ప్రాంతంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక పర్యాటకాన్ని ప్రోత్సహించడంలో దక్షిణ మధ్య రైల్వే పాత్ర కీలకమైనది.

తిరుపతికి రైలు అనుసంధానం :

దక్షిణ మధ్య రైల్వే లోని గుంతకల్ డివిజన్‌లోని తిరుపతి రైల్వే స్టేషన్ భారతదేశంలోని ప్రధాన నగరాలతో అనుసంధానించబడిన అత్యంత రద్దీగా ఉండే రైల్వే స్టేషన్‌లలో ఒకటి. హైదరాబాద్, ఢిల్లీ, చెన్నై, బెంగళూరు, ఔరంగాబాద్, హౌరా, పుదుచ్చేరి, మన్మాడ్, శ్రీకాకుళం, వారణాసి, కన్యా కుమారి, జమ్మూ, పూరి, బెంగుళూరు మొదలైన భారతదేశంలోని వివిధ ముఖ్యమైన



నగరాలకు తిరుపతికి రైలు సౌకర్యం ఉంది.

తిరుపతికి 150 ట్రైన్స్..

ప్రస్తుతం, తిరుపతికి 130 రెగ్యులర్ రైలు సర్వీసులు మరియు 20 ప్రత్యేక రైళ్ల సేవలు అందిస్తున్నాయి, ఢిల్లీ, కోల్‌కతా, సికింద్రాబాద్, బెంగళూరు, విజయవాడ, మచిలీపట్నం, నర్సాపూర్, విశాఖపట్నం, ఔరంగాబాద్, నాందేడ్ మొదలైన అనేక ప్రాంతాలకు అనుసంధానాన్ని అందిస్తోంది. తిరుపతి సాయినగర్ షిర్డీ, ఉజ్జయిని, హిసార్ వంటి ముఖ్యమైన యాత్రా స్థలాలకు కూడా అనుసంధానించబడి ఉంది.

వందేభారత్ కూడా..

అంతేకాకుండా, ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కూడిన ప్రతిష్టాత్మక వందే భారత్ రైలు కూడా సికింద్రాబాద్ నుండి తిరుపతికి నడపబడుతోంది . అదనంగా, తిరుపతికి సమీపంలోని దిగే ప్రదేశం అయిన రేణిగుంట రైల్వే స్టేషన్‌కు అనేక రైళ్లు నడుపబడుతున్నాయి. ఈ విస్తృతమైన రైలు నెట్‌వర్క్ దేశం నలుమూలల నుండి తిరుమలకు సులభంగా చేరుకునేలా చేస్తుంది.

తిరుపతి రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి:

అంతర్జాతీయ ప్రమాణాలతో సౌకర్యాలు కల్పించడంలో భాగంగా తిరుపతి రైల్వే స్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద సుమారు రూ. 300 కోట్ల వ్యయంతో పునరాభివృద్ధి పనులు మే, 2022లో ప్రారంభమయ్యాయి మరియు ఫిబ్రవరి, 2025 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2024, సెప్టెంబర్ నాటికి 60% పనులు పూర్తయ్యాయి మరియు మిగిలిన పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

ఎయిర్ పోర్ట్ లా స్టేషన్ ప్లాట్ ఫాం..

పునరాభివృద్ధి చేయబడిన తిరుపతి రైల్వే స్టేషన్ దేశం, ప్రపంచం నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో యాత్రికులు,పర్యాటకులు మరియు రైలు వినియోగదారులకు సేవలందించేందుకు ప్రపంచ స్థాయి సౌకర్యాలు మరియు సౌకర్యాలను కలిగి ఉంటుంది.పునరాభివృద్ధి చేయబడిన స్టేషన్‌లో ఎ యిర్‌కోర్స్, వెయిటింగ్ లాంజ్, ఫుడ్ కోర్ట్, వి. ఐ .పి లాంజ్, కియోస్క్‌లు, విశ్రాంతి గదులు, ఎస్కలేటర్లు, లిఫ్టులు మొదలైన ఆధునిక సౌకర్యాలు ఉంటాయి.

# పోషకాలు మిన్నగా ఉన్న నల్లవరి రకం

ఖమ్మం, మన జీవన విధానంలో మార్పులు వచ్చినట్టే.. ఇప్పుడు సాగులోనూ 'కాలా'నుగుణంగా వచ్చిన ఛేంజ్ ఇది! కాలాబాత్ అనే పిలిచే ఈ వరిని వల్లాపురంలో ఓ ఔత్సాహిక రైతు సాగు చేస్తున్నాడు. వైరా మండలం వల్లపురానికి చెందిన తుమ్మల రాణాప్రతాప్ బ్లాక్ రైస్ సేద్యం చేపట్టారు. బ్లాక్ రైస్‌ను పూర్వ కాలంలో చక్రవర్తులు, వారి కుటుంబ సభ్యులు తినేందుకే ఉపయోగించే వారని ప్రతీతి. అందుకే వీటికి చక్రవర్తుల బియ్యం అనే పేరు వచ్చింది. సాధారణ వరి కంటే బ్లాక్ రైస్ రకానికి చెందిన వరి ఎకరానికి పది నుంచి పదిహేను బస్తాలు మాత్రమే దిగుబడి వస్తుంది. నల్లబియ్యంలో కాలాబట్టి/ మణిపూర్ బ్లాక్/ సుగంధభరితం/ రత్నచోడి/ నవారా నారాయణ కామిటి వంటి రకాలున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీపీటీ 5,204 రకం వరినే రైతులు ఎక్కువగా సాగు చేస్తుంటారు. బీపీటీ సాంబలో గ్లైసిమిక్ ఇండెక్స్ జీఐ వాల్యూ. 51.42 నుంచి 56.5 శాతం రకా న్ని బట్టి ఉంది. ఈ గ్లైసిమిక్ ఇండెక్స్ ఎక్కువ ఉన్న బియ్యం తరచూ తీసుకోవడం వల్ల ఒంట్లో చక్కెర నిల్వలు పెరిగి మధుమేహానికి దారి తీస్తుంది. దీనికి తోడు పని వత్తిడి, వ్యాయామం లేకపోవడం అనేక జబ్బులు వస్తాయి.నల్లబియ్యం వల్ల ఉపయోగాలేంటంటే..వీటిలో యాంటి ఆక్సిడెంట్లు ఎక్కువ. సూక్ష్మ పోషకాలు చాలా ఎక్కువ. చక్కెర తక్కువ మాత్రమే. పీచు పదార్థాలు, యాంటి సయానిక్ యాక్సిడెంట్‌లు ఎక్కువ. విటమిన్ ఈ పుష్కలంగా లభిస్తుంది. మధుమేహాన్ని తగ్గించడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. టైపు-2 షుగర్ ఉన్న వారికి రక్తంలో ఉన్న చక్కెర శాతాన్ని తగ్గిస్తాయి. క్యాన్సర్‌తో పోరాడతాయి. రక్తనాళాలను శుభ్రపరిచి ఆరోగ్యంగా ఉంచుతుంది. ఒంట్లో కొవ్వు పెరగకుండా చూస్తాయి. శరీరంలో పెరిగే అల్జిమర్స్‌ను అడ్డుకుంటాయి. కాలేయ వ్యాధులు, ఫ్యాట్‌లివర్‌ను తగ్గిస్తాయి. బ్లాక్ రైస్ కంటి ఆరోగ్యానికి కూడా దోహదపడతాయి. దీనిలో ఉండే లాటిన్ జీయా క్సిబిన్ హానికరమైన బ్లూలైట్ తరంగాలను కంటిలోపలే అడ్డుకొని కంటి రెటినాను ఆరోగ్యంగా ఉంచుతాయి. కంటిలో ఏర్పడే శుక్లాలను అరికడతాయి.బ్లాక్ రైస్(వరి రకాలు):తుమ్మల రాణాప్రతాప్ వల్లాపురంలోని ఒక ఎకరం విస్తీర్ణంలో ఎస్56, ఎస్58, రక్తశాలి, కృష్ణ వ్రీహి రకాలను సాగు చేస్తున్నారు. గత ఏడాది రాణాప్రతాప్ ఎకరంలో ఈ నాలుగురకాల వంగడాలను సాగు చేసి 15 క్వింటాళ్ల దిగుబడి సాధించారు. కిలో రూ.200 చొప్పున బ్లాక్ రైస్ విత్తనాలు కొనుగోలు చేసి వెదజల్లే పద్ధతి లో సాగు చేశానని, దిగుబడి ఆశాజనకంగా ఉందని వివరించారు. బీపీటీ 5,204 మాదిరిగా ఉండి (సన్నబియ్యం రకం) 120 రోజుల్లో పంట కోతకు వచ్చే డబ్ల్యూజీఎస్ 1246 వంటి మినికిట్ రకాలు వచ్చే వానాకాలం అందుబాటులో ఉండేలా రైతులకు నూతన రకాలను పరిచయం చేస్తున్నారు. కిలో బ్లాక్‌రైస్‌ను రూ.వంద చొప్పున విక్రయిస్తున్నారు. కేవలం వరే కాకుండా అధిక సాంద్రత విధానంలో పత్తి సాగు చేస్తున్నారు.

# లడ్డూ వివాదంపై ఖుష్బూ ఊహించని కామెంట్స్..



హైదరాబాద్, తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో అత్యంత పవిత్రంగా భావించే లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగింది అనే వార్త సంచలనం సృష్టించింది. ప్రస్తుతం ఈ విషయం దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతోంది. ఇప్పటికే ప్రకాష్ రాజ్ (%ూతీుఝుంష్ర ుఎ%), కోలీవుడ్ హీరో కార్తీ లాంటి తారలు ఈ విషయం పై స్పందించారు కూడా.. అయితే తాజాగా ఈ ఘటనపై బీజేపీ నాయకురాలు , ప్రముఖ సీనియర్ హీరోయిన్ ఖుష్బూ ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. పలు ఆసక్తికర కామెంట్లు చేశారు.

లడ్డూ వివాదంపై ఖుష్బూ సంచలన ట్వీట్..

సోషల్ మీడియా ఫ్లాట్ ఫామ్ తన ఎక్స్ అధికారిక ఖాతా ద్వారా.. తిరుమల లడ్డూ లో జంతువుల కొవ్వు కలపడం అత్యంత దారుణం, ఈ చర్యకు పాల్పడిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఎవరిని కూడా వదిలిపెట్టవద్దు. బాధ్యులు కచ్చితంగా మూల్యం చెల్లించుకోవాల్సిందే. ముఖ్యంగా మీరు చేసిన తప్పు వెంకటేశ్వర స్వామి చూస్తున్నాడు అంటూ ఖుష్బూ ట్వీట్ చేసింది. హిందూ మతాన్ని లక్ష్యంగా చేసుకున్నప్పుడు మనల్ని సైలెంట్ గా ఉండమంటే ఎలా.. ఇతర మతాల విషయంలో కూడా ఇలాగే వ్యవహరిస్తారా..? అలాంటి ఆలోచన చేయాలంటేనే చాలామందికి వెన్నులో వణుకు పుడుతుంది. ముఖ్యంగా లౌకికవాదం అంటే ప్రతి ఒక్కరూ ప్రతి మతాన్ని గౌరవించడం. అంతేకానీ పక్షపాతంతో వ్యవహరించకూడదు. నేను కూడా హిందూ మతంలో పుట్టకపోయినా , హిందూ మతానికి చెందిన వ్యక్తినే వివాహం చేసుకున్నాను. ముఖ్యంగా నా దృష్టిలో అన్ని మతాలవారు సమానమే. కాబట్టి ఎవరూ కూడా హిందూ మతాన్ని అవమానించవద్దు అలాగే చులకనగా మాట్లాడవద్దు, మతాన్ని అవహేళనగా చూసి అగౌరవపరిస్తే సహించేది లేదు. తిరుమల లడ్డూ లో కల్తీ చేయడం అంటే కోట్లాదిమంది ప్రజల మనోభావాలు, విశ్వాసాలను దెబ్బతీయటమే కదా.. కాబట్టి తప్పకుండా బాధ్యులు కచ్చితంగా మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. వెంకటేశ్వర స్వామి అన్ని చూస్తున్నాడు అంటూ ఖుష్బూ తన పోస్టులో తెలిపింది. ప్రస్తుతం ఈ పోస్ట్ ఇప్పుడు చాలా వైరల్ గా మారుతోంది. ఇలా లడ్డు వివాదంలో కామెంట్ చేసి ఏదైనా సమస్యలో ఇరుక్కోబోతోందా అంటూ నేటిజన్స్ కంగారుపడుతున్నారు.

ఖుష్బూ కెరియర్..

ఖుష్బూ విషయాన్నికొస్తే తెలుగు , తమిళ్ చిత్రాలలో నటిస్తూ బిజీగా మారిపోయింది. ప్రజల పట్ల అలాగే సమాజం పట్ల ఈమెకు చాలా అవగాహన కూడా ఉంది. ఈమె ముస్లిం కుటుంబంలో పుట్టినప్పటికీ ఆ తర్వాత హిందూ మతానికి చెందిన ప్రముఖ డైరెక్టర్ సుందర్ సి అనే వ్యక్తిని వివాహం చేసుకుంది. ఇకపోతే కట్టుబాట్లకు కట్టుబడి ఉండాలనే రీతిలో కాకుండా స్వేచ్ఛ జీవితాన్ని అనుభవించాలనే ప్రయత్నం చేస్తూ ఉంటుంది. అందుకే తన పిల్లల విషయంలో కూడా ఎప్పుడూ ఆమె కఠిన ఆంక్షలు విధించలేదని సమాచారం. ముఖ్యంగా తన పిల్లలను తనలాగే స్వేచ్ఛగా పెంచుతుంది. ఇక ప్రస్తుతం బిజెపిలో కొనసాగుతున్న ఖుష్బూ. ఇలా లడ్డు వివాదం పై స్పందించి అందరిని ఆశ్చర్యపరిచింది.

# నరక కూపంగా సంక్షేమ హాస్టళ్ల తీరు

హైదరాబాద్,జ్వరాల భయంతో హాస్టళ్లు వణికిపోతున్నాయి. రల్తీ ఆహారం కూడా కలవర పెడుతోంది. ఇకపోతే హాస్టళ్లలో ఉండేలా పరిస్థితులు లేవని కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి తాజాగా చేసిన ప్రకటన దారుణ పరిస్థితులను కళ్లకు అద్దం పడుతున్నాయి. పదేళ్ల పాటు హాస్టళ్లను సంస్కరించామని చెప్పుకుంటున్న బిఆర్ఎస్ నేతలు దీనిపై కళ్లు తెరవాలి. ఇప్పుడే హాస్లళ్లలో సమస్యలు లేవు. అయితే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డ తరవాత వీటిని సంస్కరించలేదు. వాటి మానాన వాటిని వదిలేశారు.ఆర్భాటపు ప్రకటనలతో ప్రజలను మభ్య పెట్టారు. సన్న బియ్యం సరపరా పేరుతో కొన్ని రోజులు ఆరా÷-భాటం చేశారు. అయితే సమస్యలన్నింటికి ..ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కారణమంటూ చేస్తున్న విమర్శలు వారి కుసంస్కారానికి నిదర్శనంగా చూడాలి. అన్ఇన రంగాలను విస్మరించినట్లుగానే వసతి గృహాలను కూడా పదేళ్లుగా పక్కన పెట్టేశారు. హాస్టళ్లలో వసతులు, పరిస్థితులు బాగులేక విద్యార్థులు ఇంటిబాట పడుతున్నారు. ఇటీవలకాలంలో హాస్టళ్లలో విద్యార్థులు మృతి చెందడం అధికారులు, ప్రజాప్రతినిధులను కలవరానికి గురిచేస్తోంది. సీజనల్‌వ్యాధుల ముప్పును తప్పించుకునేందుకు పలుచోట్ల వైద్యశాఖ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నప్పటికీ పూర్తిస్థాయిలో అదుపులోకి రావడంలేదు. హాస్టళ్లలో కొన్నిచోట్ల మురుగునీరు పారుతోంది. మరికొన్ని చోట్ల డంప్‌యార్డులు, పారిశుధ్య సమస్య, ఇతర ఇబ్బందులుంటున్నాయి. ఇటీవల వర్షాలతో ఒక్కసారిగా దోమలు, ఈగలు ప్రబలడంతో జ్వరాల మోత మోగుతోంది. తలనొప్పి, కడుపునొప్పి, జ్వరం, జలుబు, దగ్గు, బాడీ పెయిన్స్, అలసట తదితరసమస్యలతోనే విద్యార్థులు బాధపడుతున్నారు. గిరిజన, సాంఘిక సంక్షేమ, మైనార్టీ, ఎంజేపీ, కస్తూర్బా, ఆదర్శ, జూనియర్, డిగ్రీ కళాశాలలతోపాటు ఇతర అన్ని గురుకులాల్లో



అనేక ఇబ్బందులు ఉన్నాయనే ఆరోపణలున్నాయి. ఈ విద్యాసంస్థల్లో వేలాది మంది విద్యార్థులు చదువుకుం టున్నారు. వీరిలో అనేకమంది సీజనల్‌వ్యాధులబారిన పడుతున్నా యంత్రాంగం ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోవడం లేదు. హాస్టళ్లలో సిబ్బంది విద్యార్థులకు మెనూప్రకారం భోజనం పెట్టకపోవడం శాపంగా మారుతోంది. కొన్నిచోట్ల కలుషిత ఆహారం వల్ల విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారు. కుళ్లిపోయిన కోడిగుడ్లు, నాణ్యతలేని ఆహారం అందిస్తూ అందిన కాడికి దోచుకుంటున్నారు. సంబంధిత ఆహార సరఫరా కాంట్రాక్టర్లు, సిబ్బంది మిలాఖత్ కావడం అధికారులు పట్టించుకోకపోవడంతో ఇష్టారాజ్యంగా తయారైంది. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు కాచి చల్లార్చిన నీరు తాగాలని వైద్యులు సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల వల్ల వివిధ రకాల సీజన ల్ వ్యాధులు ప్రబలే అవకాశం అధికంగా ఉందన్నారు. ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

# భారీగా పెరిగిన వంటనూనెల ధరలు

న్యూఢిల్లీ,పండుగ సీజన్‌లో వంటనూనెలు మంటపెడుతున్నాయి. వంట చేసుకోవాలంటేనే ఆలోచించాల్సి వస్తోంది. దసరా, దీపావళి వంటి కీలక పండుగల సమయంలో వంట నూనెల ధరలుభారీగా పెరగడం ఆందోళనకు గురి చేసింది. లీటర్ సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్ ఏకంగా 130 రూపాయలకు చేరింది. రిటైల్‌గా వెల్లుల్లి 450 కిలో అమ్ముతున్నారు. ఉల్లి 70పైనే అమ్ముతున్నారు. ఇలా ఒక్కటేమిటి..అన్ని నిత్యావసర ధరలు భారీగా పెరిగాయి. వీటికి తోడు నిత్యం వాడే నూనె ధరలు పెరగడం ప్రజల్లో ఆందోళ ్న కలిగిస్తోంది. ప్రభుత్వ అధికారిక గణాంకాల ప్రకారం, ఈ నెల రోజుల్లో ఆవనూనె ధరలు 9.10 శాతం, పామాయిల్ ధరలు 14.16 శాతం పెరిగాయి. నెల రోజుల్లో, ఆవనూనె ధర ఇటు రిటైల్ మార్కెట్‌లో అటు ఆన్‌లైన్ కిరాణా కంపెనీల పోర్టల్స్‌లో 26 శాతం పెరిగింది. నెల రోజుల క్రితం ఆన్‌లైన్ కిరాణా పోర్టల్‌లో లీటరు ఆవనూనె రూ.139 కి లభించగా, ఇప్పుడు దీని ధర లీటరుకు రూ.176 కి చేరుకుంది. అంటే గత నెలలో ధరలు 26.61 శాతం పెరిగాయి. మస్టర్డ్ ఆయిల్‌ను ఉత్తర భారతదేశంలోని చాలా ప్రాంతాల్లో వంటనూనెగా ఉపయోగిస్తారు. ప్రభుత్వ లెక్కలు కూడా ఎడిబుల్ ఆయిల్ ధరల పెరుగుదల నిజమేనని చెబుతున్నాయి. కేంద్ర వినియోగదార్ల వ్యవహారాల శాఖకు చెందిన ధరల పర్యవేక్షణ విభాగం వెల్లడించిన వివరాల ప్రకారం.. నెల క్రితం, 25 ఆగస్టు 2024న లీటరు ఆవాల నూనె రూ.139.19 కి లభించగా, ఇప్పుడు రూ.151.85 కి అందుబాటులో ఉంది. లీటరు ఆవనూనె దిల్లీలో రూ.165, ముంబయిలో రూ.183, కోల్‌కతాలో రూ.181, చెన్నైలో రూ.167 పలుకుతోంది.సాధారణంగా, దక్షిణ భారతదేశంలో వంటనూనెలుగా ఉపయోగించే పొద్దుతిరుగుడు పువ్వుల నూనె, పామాయిల్, సోయా ఆయిల్ రేట్లు కూడా పెరిగాయి. నెల రోజుల క్రితం, సన్‌ఫ్లవర్ ఆయిల్ లీటరు రేటు రూ.119.38 గా ఉండగా, ప్రస్తుతం



లీటరు రూ.129.88 కి లభిస్తోంది. నెల క్రితం లీటరు రూ.98.28 గా ఉన్న పామాయిల్ ఇప్పుడు లీటరుకు రూ.112.2 కి చేరింది. సోయా ఆయిల్ ధరలు కూడా నెల రోజుల్లో లీటరుకు రూ.117.45 నుంచి రూ.127.62 కి పెరిగింది. వెజిటబుల్ ఆయిల్ ధర లీటరుకు రూ.122.04 నుంచి రూ.129.04 కి ఎగబాకింది.డిబుల్ ఆయిల్‌ల దిగుమతి సుంకాన్ని పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది. దీనివల్లే వంటనూనెల దిగుమతులు ఖరీదయ్యాయి. క్రూడ్ సోయాబీన్ ఆయిల్, క్రూడ్ పామాయిల్, క్రూడ్ సన్‌ఫ్లవర్ ఆయిల్‌పై దిగుమతి సుంకాన్ని 0 నుంచి 20 శాతానికి; రి÷న్డ్ ఎడిబుల్ ఆయిల్స్ దిగుమతిపై సుంకాన్ని 12.5 శాతం నుంచి 32.5 శాతానికి పెంచింది. ప్రభుత్వ నిర్ణయం వల్ల పామాయిల్ నుంచి సోయా వరకు అన్ని రకాల వంటనూనెల ఖరీదయ్యాయి. దేశీయ రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు దిగుమతి సుంకాన్ని పెంచినట్లు కేంద్ర ప్రభుత్వం చెప్పినప్పటికీ, రేట్ల పెంపు ప్రభావం నేరుగా సామాన్య జనంపై పడింది. నూనెలను ఎక్కువగా వినియోగించే పండుగ సీజన్‌లో, సరైన టైమ్ చూసి సర్కారు దెబ్బకొట్టింది.

# కర్ణాటకలో ఉర్దూ భాష వివాదం.. మరో చిక్కులో పడ్డ సిద్ధరామయ్య సర్కార్



కర్ణాటకలో ప్రస్తుతం ముడా స్కామ్ సంచలనం రేపుతున్న సంగతి తెలిసిందే. తాజాగా మరో అంశం వివాదస్పదమవుతోంది. సిద్ధరామయ్య ప్రభుత్వం.. ముస్లిం జనాభా ఎక్కువగా ఉన్న రెండు జిల్లాల్లో అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు దరఖాస్తు చేసుకునేవారికి ఉర్దూ భాష రావడం తప్పనిసరి చేసింది. దీంతో ఈ నిర్ణయాన్ని విపక్ష పార్టీ బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం బుజ్జగింపు రాజకీయాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఇది సామాజిక సామరస్యానికి ఆటంకం కలిగిస్తుందని ఆరోపిస్తోంది.

ఉర్దు రావాల్సిందే

ఇక వివరాల్లోకి వెళ్తే.. కర్ణాటకలో ముదిగెరె, చిక్కమగళూరు అనే రెండు జిల్లాలు ఉన్నాయి. ఈ జిల్లాల్లో ముస్లిం జనాభా 31.94 శాతంగా ఉంది. అయితే ఇటీవలే కర్ణాటక ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ రెండు జిల్లాల్లో అంగన్‌వాడీ టీచర్ల పోస్టుకు దరఖాస్తు చేసుకునేవారికి ఉర్దూ భాష తప్పనిసరిగా తెలియాలని ఉద్యోగ నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఈ నిర్ణయంపై రాష్ట్రంలో వ్యతిరేకత వస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం.. రాష్ట్ర భాషా సమైక్యతను దెబ్బతీయాలని చూస్తోందని బీజేపీ ఆరోపిస్తోంది. బీజేపీ మాజీ ఎంపీ నలిన్ కుమార్‌తో సహా మరికొందరు పార్టీ నేతలు.. సిద్ధరామయ్య ప్రభుత్వం ముస్లిం బుజ్జగింపు రాజకీయాలు చేసేందుకు ప్రయత్నిస్తోందని విమర్శిస్తున్నారు. ఉర్దు తప్పనిసరి చేయడం వల్ల కన్నడ మాట్లాడేవాళ్లు తమ సొంత రాష్ట్రంలోనే ఉద్యోగ అవకాశాలు కోల్పోతారని ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

కన్నడను దెబ్బతీసే ప్రయత్నం

ఇదిలాఉండగా.. కర్ణాటక రాజకీయాల్లో భాషారమైన సమస్య చాలాకాలంగా సున్నితమైన అంశంగా ఉంది. గతంలో హిందీ భాషను కూడా విధించాలని ప్రయత్నించినప్పుడు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమయ్యాయి. అయితే ఇప్పుడు రెండు జిల్లాల్లో అంగన్‌వాడీ టీచర్ పోస్టుల కోసం ఉర్దు భాషను కూడా తప్పనిసరి చేయడంపై కూడా వివాదం చెలరేగుతోంది. ఈ నిర్ణయం రాష్ట్ర అధికార భాష అయిన కన్నడను దెబ్బతీసేలా ఉందనే ఆరోపణలు వస్తున్నాయి. కన్నడ కన్నా ఉర్దూ భాషకు ప్రాధాన్యం ఇవ్వడం ఏంటనే విమర్శలు సైతం వస్తున్నాయి. కర్ణాటకలో వివిధ రాష్ట్రాల నుంచి చాలామంది ఉద్యోగాల కోసం వస్తుంటారు. ముఖ్యంగా బెంగళూరు లాంటి నగరాల్లో ఇది అధికంగా ఉంటుంది. ఇక్కడ వచ్చే వలసదారుల్లో చాలామంది హిందీ, తెలుగు, తమిళ్, మరాఠీ మాట్లాడేవారు ఉన్నారు. హిందీ భాషను విధించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఇప్పుడు పలు ప్రాంతాల్లో ఉర్దూ భాషకు ప్రాధాన్యమివ్వడం మరింత సమస్యాత్మకంగా మారింది. అంగాన్‌వాడీ టీచర్లు.. ప్రభుత్వ పతకాలు, ప్రజల మధ్య వారధిగా పనిచేస్తారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వీళ్ల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. సాధారణంగా కర్ణాటకలో కన్నడ మాట్లాడే ప్రజలే ఎక్కువగా ఉంటారు. అయితే ఉర్దు భాషను తప్పనిసరి చేయడం వల్ల అంగాన్‌వడి వర్కర్లు, ప్రజల మధ్య సంబంధం తొలగించినట్లు అవుతుందని పలువురు భావిస్తున్నారు.

భవిష్యత్తులో ప్రమాదం

ఉర్దూ భాష రానివాళ్లు కూడా ఆయా ప్రాంతాల్లో ఉంటారని.. దీనివల్ల ఇబ్బందులు తలెత్తే అవకాశాలున్నాయని చెబుతున్నారు. మైనార్టీ ప్రజలకు ఉపయోగపడే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నప్పటికీ.. ఇది భాషా పరమైన వైవిధ్యాన్ని దెబ్బతీస్తుందని అంటున్నారు. కన్నడ భాషకు తొలిప్రాధాన్యం ఇవ్వాలని.. కనీసం ఉర్దూకి సమానంగా పరిగణించాలని చెబుతున్నారు. దీనివల్ల అంగన్‌వాడీ టీచర్లు మైనార్టీ ప్రజలకు సేవలందిస్తూనే.. స్థానిక భాషను కొనసాగిస్తారని అభిప్రాయపడుతున్నారు. ఈ నిర్ణయం కేవలం భాషాపరమైన విభజన మాత్రమే కాకుండా.. భవిష్యత్తు విధానాలను కూడా ప్రమాదంలోకి నెట్టే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# పొత్తు ధర్మానికి పవన్ తూట్లు?



విజయవాడ:జనసేన అధినేత పవన్ కల్యాణ్ తీరు పట్ల ఒంగోలు తెలుగుదేశం శ్రేణులు రగిలిపోతున్నాయి. జగన్ హయాంలో ఐదేళ్ల పాటు బాలినేని అరాచకాలు, దౌర్జన్యాలను ఎదుర్కొని, ఎదురొడ్డి నిలిచిన తెలుగుదేశం శ్రేణులు ఇప్పుడు అదే బాలినేనిని కూటమి భాగస్వామ్య పక్షమైన జనసేన గూటికి చేరడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. వాస్తవానికి తెలుగుదేశంతో పాటు జనసేన శ్రేణులూ నేతలూ కూడా బాలినేని దాష్టీకాన్ని చవి చూసిన వారు. అయినా తెలుగుదేశంతో కనీస మాత్ర చర్చ లేకుండా ఏకపక్షంగా బాలినేనికి జనసేన తీర్థం ఇచ్చేయడాన్ని తెలుగుదేశం తప్పుపడుతోంది. జనసేన గూటికి చేరడానికి ముందు బాలినేని తెలుగుదేశం తలుపు తట్టారు. అయితే పార్టీ కేడర్ మనోభావాలను గుర్తించి ందుకు అనుగుణంగా చంద్రబాబు బాలినేని ఎంట్రీకి నో చెప్పారు. అయితే బాలినేని ఎంట్రీకి పవన్ కల్యాణ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా.. ఆయనకేమీ రెడ్ కార్పెట్ పరచలేదు. జనసేన గూటికి చేరితే బాలినేని స్థానం ఏమిటి? స్థాయి ఏమిటి అన్నది చేరికకు ముందే చెప్పారు. బాలినేని కోరినట్లు పవన్ కల్యాణ్ ఒంగోలు వెళ్లి భారీ బహిరంగ సభవేదికగా పార్టీ కండువా కప్పలేదు. పోనీ మంగళగిరి భారీ ర్యాలీగా వచ్చి చేరుతానని బాలినేని కోరినా నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. ఒంటరిగా, ఎలాంటి హంగూ, ఆర్భాటం, హడావుడీ లేకుండా సింపుల్ గా వచ్చి జనసేన కండువా కప్పించుకుని సైలెంట్ అయిపోవాలని కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. ఇది కచ్చితంగా బాలినేనికి మింగుడుపడని అంశమే. ఎందుకంటే.. ఆయన జనసేనలో చేరిక ఖరారు అయిన క్షణం నుంచీ ఫ్లెక్సీల విషయంలో ఆయన వ్యవహరించిన తీరు తెలుగుదేశం శ్రేణులను రెచ్చగొట్టేదిగానే ఉంది. అదే ఫ్లెక్సీల చించివేతకు కారణమైంది. ఈ నేపథ్యంలో పవన్ కల్యాణ్ బాలినేనికి తన స్థానమేంటో చూపారు. అంత వరకూ బానే ఉన్నప్పటికీ, ఒంగోలు నియోజకవర్గంలో తెలుగేదేశం శ్రేణులు అసంతృప్తికి గురి కాకుండా వారిని ఒప్పించి బాలినేనిని చేర్చుకునే ప్రయత్నం చేసి ఉండాల్సిందని పరిశీలకులు అంటున్నారు.బాలినేని జగన్ తో విభేదించి బయటకు వచ్చినట్లు బయటకు చెబుతున్నా.. పబ్బం గడుపుకుని వచ్చే ఎన్నికల నాటికి మళ్లీ జగన్ పంచనే చేరుతారని బాలినేని అనుచరులే చెబుతున్నారు. జగన్ బాలినేనికి సమీప బంధువు కావడం, గతంలో ఎన్నిసార్లు జగన్ తో విభేదాలు తలెత్తినా, పార్టీలో కనీస గౌరవం దక్కకపోయినా బాలినేని వైసీపీని వీడే ప్రయత్నం చేయలేదు. ఇప్పుడు కూడా ఆయన జగన్ కోవర్ట్ గానే తెలుగుదేశం, జేనసేన శ్రేణుల మధ్య విభేదాలు సృష్టించే వ్యూహంలో భాగంగానే పార్టీ మారారని జనసేన శ్రేణులే చెబుతున్నాయి. అంతే కాకుండా వరుసగా జనసేన మాజీ ఎమ్మెల్యేలను పవన్ కల్యాణ్ పిలిచి మరీ జనసేన కండువా కప్పడాన్ని కూటమి పార్టీల శ్రేణులు సైతం తప్పుపడుతున్నాయి. చేరికల విషయంలో కూటమిలోని మూడు పార్టీల అధినేతలూ కూర్చుని మాట్లాడుకుని ఒక ఏకాభిప్రాయానికి రావాల్సిన అవసరం ఉందని అంటున్నారు.

## ఢీకొన్న ఇంజనీరింగ్ కాలేజీల బస్సులు

మెదక్,మెదక్ జిల్లాలో నర్సాపూర్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పట్టణ శివారులోని క్లాసిక్ గార్డెన్ వద్ద బీవీఆర్ఐటీ కళాశాలకు చెందిన రెండు బస్సులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరు డ్రైవర్లు తీవ్రంగా గాయపడ్డారు. డ్రైవర్లు బస్సుల్లో ఇరుక్కుపోవడంతో బయటకు తీయడానికి శ్రమించాల్సి వచ్చింది. వారిలో నాగరాజు (50) మృతిచెందారు. 20 మందికి పైగా విద్యార్థులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఆస్పత్రులకు తరలించారు. ఘటనాస్థలానికి నర్సాపూర్ సీఐ జాన్ రెడ్డి, ఎస్సై లింగం చేరుకుని పరిశీలించారు. ఈ ప్రమాదంతో నర్సాపూర్– సంగారెడ్డి మార్గంలో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసులు, కళాశాల సిబ్బంది చర్యలు చేపట్టారు.

# సాక్షాలు ఉన్నా.. చర్యలేవి...

విజయవాడ,మాజీ ముఖ్యమంత్రి జగన్ తిరుమల పర్యటన, డిక్లరేషన్ అంశంపై రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ అంశంపై ఏపీసీసీ చీఫ్ షర్మిల స్పందించారు. తిరుమలలో జగన్ డిక్లరేషన్ ఇవ్వాల్సిన అవసరం ఉందా అని షర్మిలను మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. తిరుమలలో డిక్లరేషన్ ఇవ్వాల్సిన రూల్ అందరికీ వర్తిస్తుందని సమాధానమిచ్చారు. “రూల్స్ అప్లైడ్ ఫర్ ఆల్ పీపుల్” అని ఏపీసీసీ చీఫ్ వ్యాఖ్యానించారు.

సాక్షాలు ఉన్నా.. చర్యలేవి...

రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు , డిప్యూటీ సీఎం పవన్ పశ్చాత్తాప దీక్ష , మాజీ సీఎం జగన్ ప్రక్షాళన దీక్షలు చేస్తున్నారని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల అన్నారు. మీడియాతో మాట్లాడుతూ... ఒకరిపై పోటీ పడి నీచ మైన మత రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. జగన్ సర్కారు తిరుమల లడ్డూను కల్తీ చేసిందని ఆరోపించారు. వైసీపీ హయాంలో మార్కెట్ కంటే తక్కువకే జగన్ సర్కారు నెయ్యి కొనుగోలు చేసిందన్నారు. లడ్డూలకు వాడే నెయ్యిలో జంతు కొవ్వులు ఉన్నాయని ల్యాబ్‌లోనూ నిర్ధారించారని తెలిపారు. నెయ్యి కల్తీ జరిగిందనే విషయం చంద్రబాబుకు తెలుసని.. సాక్ష్యాలు, రిపోర్టులు ఉన్నా చంద్రబాబు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.

బీజేపీ ఉద్దేశమదే...

హిందూ మతంపై దాడి అని బీజేపీ మాట్లాడుతోందని... చర్చిలు, మసీదుపై దాడి జరిగితే ఇలాగే ఉంటారా అని పవన్ దుర్మార్గంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మత విద్వేషాలు పెంచే ఆలోచన కూటమి నేతలకు ఉందా అంటూ ఏపీసీసీ చీఫ్ నిలదీశారు. మతాలను రెచ్చగొట్టడమే బీజేపీ ఉద్దేశమని వ్యాఖ్యలు చేశారు. రాజకీయ లబ్ది కోసం కావాలనే రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం భావ్యం కాదన్నారు. కేంద్ర మంత్రులు కూడా బాధ్యతారాహిత్యంగా మాట్లాడటం సరైంది కాదన్నారు. సెంటిమెంట్ దెబ్బతీసేలా మాట్లాడుతున్నప్పటికీ ప్రధాని మోదీ కనీసం ఎందుకు స్పందించడం లేదని అడిగారు. కనీసం సీబీఐ విచారణ జరగాలని మోదీకి ఎందుకు అనిపించలేదని



ప్రశ్నించారు.

సీజేఐకి లేఖ రాశా..

రెండు నెలలైనా విచారణకు ఎందుకు ఆదేశించలేదన్ని ప్రశ్నల వర్షం కురిపించారు. హిందూ మతంపై నిజంగా కుట్ర జరిగితే సీబీఐ దర్యాప్తులో తేలేది కదా అని అన్నారు. రెండు నెలల ముందే సిట్ వేసి ఉంటే రచ్చ జరిగేదే కాదు కదా అని అన్నారు. చంద్రబాబు, పవన్, జగన్ అంతా కలసి నీచరాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో మతోన్మాద చర్యలు అవసరం లేదన్నారు. తిరుమల వ్యవహారంలో సవాళ్లు, దీక్షలు,ప్రమాణాలు అవసరం లేదన్నారు. తిరుమల లడ్డూ కల్తీ ఘటన విషయమై ప్రజలకు నిజం తెలియాలన్నారు. తిరుమలలో మళ్లీ తప్పు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ వ్యవహారంపై పీసీసీ అధ్యక్షురాలిగా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాసినట్లు తెలిపారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై సుమోటోగా తీసుకుని విచారణ జరపాలని సీజేఐని కోరామన్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com